మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 సంచిక 352 | గురువారం 04 డిసెంబర్ 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 వెల: 3 రూ/-

## నేటి మాట

మహిళలు సాధించిన పురోగతి స్థాయిని బట్టి నేను సమాజ పురోగతిని కొలుస్తాను.



-డా.బి.ఆర్.అంబేడ్కర్

# 80 వేల మంది చూస్తుండగా.. కాల్చి చంపిన 13 ఏళ్ల బాలుడు.. భక్తితో నినాదాలు చేసిన జనాలు

అది ఒక భారీ స్టేడియం.. అక్కడ సుమారు 80 వేల మందికి పైగా జనం గుమికూడారు. అంత మంది చూస్తుండగా.. ఓ 13 ఏళ్ల బాలుడు.. తన ఎదురుగా ఉన్న వ్యక్తి గుండెల్లోకి గురి చూసి కాల్పులు జరిపాడు. తూటా దెబ్బకు ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది చూసి చుట్టూ ఉన్న జనాలు భక్తితో ఆర్తనాదాలు చేశారు. మరి కొందరు హాహాకారాలు చేశారు. ఏది ఏమైనా పదమూడేళ్ల పిల్లాడి చేతికి గన్ ఇవ్వడమే తప్పు అనుకుంటే.. ఆ బాలుడి చేతనే చంపించడం మరింత దారుణం. ఇంతకు ఈ సంఘటన ఎక్కడ చోటు చేసుకుంది అంటే.. ఇంకెక్కడ తాలిబన్ల పాలన కొనసాగుతున్న ఆఫ్ఘనిస్థాన్‌లో తూర్పు ఆఫ్ఘనిస్థాన్‌లోని ఒక స్టేడియంలో ఈ బహిరంగ మరణ శిక్ష అమలు చేశారు. ఈ ఘటనను ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల అధికారులు 'అమానవీయం' అని ఖండించారు. వివరాల ప్రకారం.. మంగల్ అనే వ్యక్తి తూర్పు ఆఫ్ఘనిస్థాన్‌లోని ఖోస్ట్‌లో ఒకే కుటుంబానికి చెందిన 13 మందిని దారుణంగా హత్య చేశాడు. అందులో తొమ్మిది మంది చిన్నారులున్నారు. ఈ కేసును విచారించిన సుప్రీం కోర్టు అతడికి మరణ శిక్ష విధించింది. బాధిత కుటుంబానికి చెందిన 13 సంవత్సరాల బాలుడు.. నిందితుడైన మంగల్‌ను తుపాకీతో కాల్చి


3 లో

మరణ శిక్షను అమలుపర్చాడు.

ఈ శిక్షను చూడటానికి వేలాది మంది ప్రజలు హాజరయ్యారు. ఈ మరణశిక్షను కోర్టు 'ప్రతీకార శిక్ష'గా అభివర్ణించింది. కేసును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోర్టు తెలిపింది. బాధితుల కుటుంబాలకు క్షమాభిక్ష, శాంతి ప్రతిపాదనలు చేశామని, కానీ వారు తిరస్కరించారని కోర్టు పేర్కొంది. ఈ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి మాట్లాడుతూ..

## ఫార్ములా ఈ-రేసు కేసులో బిగ్ అప్‌డేట్

### అరవింద్ కుమార్‌పై చర్యలకు DoPTకి సీఎస్ లేఖ



3 లో

తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న ఫార్ములా ఈ-రేసు ఆర్థిక అవకతవకల కేసుకు సంబంధించి మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను విచారించేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, శిక్షణా శాఖ DoPT కి లేఖ రాశారు. అక్కడి నుంచి అనుమతి రాగానే ఏసీబీ ఆయనపై చార్జ్‌షీటు దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ-కార్ రేసు నిర్వహణకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా రూ.55 కోట్ల నిధులు విదేశీ సంస్థకు విడుదల చేయడంపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ ) కేసు నమోదు చేసింది.


## లీకేజీ కలకలం, HILT పాలసీపై ప్రభుత్వం సీరియస్, అంతర్గత విచారణకు ఆదేశం


2 లో

## .కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో దడ పుట్టించిన నాటు బాంబు పేలుడు!


2 లో

## చిత్రపురి కాలనీ అక్రమాల కేసు, 15 మందిపై తుది నివేదిక - రూ. 43.78 కోట్లు రికవరీకి సిఫారసు!



2 లో

## స్టెరాయిడ్స్ ఉచ్చులో యువత , చాంద్రాయణగుట్టలో ఆటోలో ఇద్దరు మృతదేహాలు


2 లో

## తూర్పు గోదావరి జిల్లాలో సీఎం చంద్రబాబు 'రైతన్న... మీ కోసం' కార్యక్రమం


2 లో

## మునుగోడులో 'రాజన్న రూల్స్' అమలు,మధ్యాహ్నం 1 గంట తర్వాతే వైన్స్ ఓపెన్!


2 లో

## పవన్ కల్యాణ్‌పై కవిత తీవ్ర వ్యాఖ్యలు, పవన్ ముందు నుంచే తెలంగాణ వ్యతిరేకి


2 లో

## అదానికి భారీగా భూములు కేటాయిస్తున్న ఏపీ ప్రభుత్వం


2 లో

# లేని సామాజికవర్గాలకు రిజర్వేషన్‌లా?

## పది మంది ఉన్నా.. నాలుగైదు పదవులా?

- పంచాయతీ రిజర్వేషన్ల తీరుపై హైకోర్టు ఆక్షేపణ
- సవరణకు ఆదేశాలిస్తే తీవ్ర పరిణామాలు
- డివిజన్ బెంచ్ దీనిపై సరైన నిర్ణయం తీసుకోవాలి
- కేసును డివిజన్ బెంచ్ ముందుంచాలని ఆదేశం

మిగతా 2 లో

రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపు తీరును హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. కొన్ని గ్రామాల్లో ఆయా సామాజికవర్గాల వారు లేనప్పటికీ వారికి రిజర్వేషన్లు కేటాయించడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. గ్రామాల్లో లేని కులాలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని తప్పుపట్టింది. గ్రామంలో కేవలం పదిమంది కన్నా తక్కువ ఉన్న వర్గాలకు నాలుగైదు పదవులను ఎలా రిజర్వ్ చేస్తారని ప్రశ్నించింది.




## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల వివాదం, వక్రీకరించవద్దు అంటూ జనసేన ప్రకటన




ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల కోనసీమ జిల్లాలో దెబ్బతిన్న కొబ్బరి తోటల పరిశీలన సందర్భంగా చేసిన కొబ్బరి చెట్లకు తెలంగాణ వాళ్ల దిష్టి తగిలేసింది వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. కోనసీమలో ఎండిపోతున్న కొబ్బరి చెట్లను పరిశీలించిన పవన్ కళ్యాణ్,

## సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ డిమాండ్


2 లో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవతలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు, బీజేపీ నాయకులు భాను ప్రకాష్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. హిందూ సమాజానికి సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శలు అగ్గి రాజేస్తున్నాయి.

# భూముల ధరకు రెక్కలు.. అక్కడ ఎకరా రూ.151.25 కోట్లు !


3 లో

హెచ్ఎండీఏకు సంబంధించిన కోకాపేట్ లోని నియోపొలిస్ లేఅవుట్ లోని భూముల ధరలు మండిపోతున్నాయి. 17, 18వ నంబర్ ప్లాట్ల కంటే 15,16 ప్లాట్ల ధరలు రాకెట్ తరహాలో దూసుకెళ్లాయి. ఎకారకు రూ.151.25 కోట్లు పలుకడంతో నియో పొలిస్ లేఅవుట్ మరోసారి రికార్డు క్రియేట్ చేసింది. మరో ప్లాట్ లోని ఎకరాకు రూ.147.75 కోట్లు పలికింది. ఈ రెండు ప్లాట్ల ద్వారా హెచ్ఎండీఏకు రూ.1352కోట్ల ఆదాయం సమకూరింది. ఇప్పటి వరకు నిర్వహించిన నాలుగు ప్లాట్ల వేలం ద్వారా హెచ్ఎండీఏకు రూ.2,708 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ లేఅవుట్ లోని మరో రెండు ప్లాట్లకు డిసెంబర్ 3వ తేదీన వేలం నిర్వహించనున్నారు.

# తెలంగాణ రైజింగ్ సదస్సుకు రండి..

## ప్రధాని మోడీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి


2 లో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం ఉదయం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు ప్రధానిని కలిశారు. ప్రస్తుతం పార్లమెంట్ శీతాకాల సమావేశాలు కొనసాగుతున్నందున పార్లమెంట్ భవనంలోనే ప్రధానితో రేవంత్ రెడ్డి భేటీ అయి ఈనెల 8, 9వ తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సమ్మిట్ గురించి రేవంత్ ప్రధానికి వివరించారు. దాదాపు అరగంటపాటు జరిగిన భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశ విస్తరణకు అనుమతి, రీజనల్ రింగ్ రోడ్డు దక్షిణ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అలాగే హైదరాబాద్- బెంగళూరు-చెన్నై బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుపై విన్నవించారు.

## లీకేజీ కలకలం, HILT పాలసీపై ప్రభుత్వం సీరియస్, అంతర్గత విచారణకు ఆదేశం

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ (HILT) పాలసీకి సంబంధించిన కీలక సమాచారం, కసరత్తు దశలోనే లీకవడంపై ప్రభుత్వం అత్యంత తీవ్రంగా స్పందించింది. అంతర్గతంగా ఏం జరిగిందనే దానిపై సమగ్ర విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ప్రభుత్వంలోని కీలక విధానాలపై సమాచారం బయటకు రావడంపై ముఖ్యమంత్రి కార్యాలయం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

HILT పాలసీని తుదిరూపు ఇచ్చేందుకు ప్రభుత్వం ఉన్నత స్థాయిలో కసరత్తు చేస్తున్న సమయంలోనే దీనికి సంబంధించిన ముసాయిదా వివరాలు బయటకు రావడం కలకలం సృష్టించింది. పాలసీకి సంబంధించిన కీలక వివరాలు, ముఖ్యంగా ఫోటోషాప్ స్లైడ్స్ రూపంలో బయటకు వచ్చినట్లు అనుమానిస్తున్నారు. అంటే, ప్రభుత్వ ఉన్నత స్థాయి సమావేశాలలో చర్చించిన ప్రజెంటేషన్ స్లైడ్స్ యొక్క స్క్రీన్ షాట్స్ లేదా కాపీలు అనధికారికంగా చేతులు మారినట్లు స్పష్టమవుతోంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఈ పాలసీపై ప్రెస్ మీట్ నిర్వహించి వివరాలు వెల్లడించారు. లీకైన సమాచారంపై అప్పటికే ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించడం ప్రారంభించాయి. ప్రభుత్వం హిల్ట్ పాలసీకి సంబంధించిన జీవో-27 ను అధికారికంగా విడుదల చేసింది. సమాచారం లీకైన తేదీ నవంబర్ 20 మరియు మంత్రి అధికారికంగా ప్రకటించిన తేదీ నవంబర్ 21 మధ్య కేవలం ఒక్కరోజు మాత్రమే తేడా ఉండటం, అంతకుముందే ముసాయిదా వివరాలు బయటకు రావడం ప్రభుత్వానికి అత్యంత ఇబ్బందికరంగా మారింది.

పాలసీకి సంబంధించిన అత్యంత గోప్యమైన సమాచారం, అధికారిక ప్రకటనకు ముందే బయటకు రావడం వెనుక ప్రభుత్వంలోని 'నల్ల గొర్రెలు' ఉన్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయం ఈ లీక్‌ను భద్రతా ఉల్లంఘనగా పరిగణిస్తున్నట్లు సమాచారం.

పాలసీ ముసాయిదా, స్లైడ్స్ లేదా అంతర్గత నోట్స్‌ను పరిశ్రమల శాఖలో లేదా ఇతర అనుబంధ విభాగాల్లో ఏయే అధికారులు, సిబ్బంది యాక్సెస్ చేశారు అనే కోణంలో విజిలెన్స్ విచారణ జరగనుంది. లీకేజీ వెనుక పాలకపక్షంలోని అంతర్గత విభేదాలు, లేదంటే ప్రతిపక్ష పార్టీలకు అనుకూలంగా పనిచేస్తున్న 'గూఢచారులు' పాత్ర ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతున్నట్లు అత్యున్నత వర్గాలు వెల్లడించాయి. ఈ లీకేజీకి బాధ్యులైన వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

HILT పాలసీని ప్రభుత్వం ప్రకటించిన నాటి నుండి ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. ఓఆర్ఆర్ లోపల ఉన్న 22 పారిశ్రామిక వాడల్లోని దాదాపు 9,292 ఎకరాల విలువైన భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు అప్పగించి లక్షల కోట్ల రూపాయల కుంభకోణానికి తెరలేపారని ఆరోపిస్తున్నాయి. ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే ఈ పాలసీని తీసుకొచ్చి ప్రభుత్వ ఆస్తులను లూటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వెంటనే జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. అయితే, HILT పాలసీపై వస్తున్న ఆరోపణలను మంత్రుల ఉప-సంఘం ఇప్పటికే ఖండించింది. కాలుష్యాన్ని తగ్గించడం, నగరాన్ని ఆధునీకరించడం మరియు ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడమే పాలసీ లక్ష్యమని మంత్రులు స్పష్టం చేశారు. ?ఏదేమైనా, పాలసీ రూపకల్పన ప్రక్రియలోనే లీకేజీ జరగడం అధికార యంత్రాంగంలో అలజడి రేపుతోంది. విజిలెన్స్ విచారణలో ఎలాంటి విషయాలు బయటపడతాయి, ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించిన 'కీలక వ్యక్తులు' ఎవరో తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడక తప్పదు.

## కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో దడ పుట్టించిన నాటు బాంబు పేలుడు!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రధాన రైల్వే స్టేషన్ అయిన కొత్తగూడెంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన నాటు బాంబు పేలుడు సంఘటన ప్రయాణీకులను ఉలిక్కిపడేలా చేసింది. గుర్తు తెలియని వ్యక్తులు ప్లాట్‌ఫామ్ నంబర్ 1 సమీపంలో ఓ నల్లని సంచిలో అత్యంత ప్రమాదకరమైన బాంబును అమర్చారు. ఈ విషయం ఎవరికీ తెలియక ముందే, రైల్వే ట్రాక్ సమీపంలో సంచరిస్తున్న ఓ వీధి కుక్క ఆ సంచిని చూసి, అందులో తినే వస్తువులు ఉన్నాయేమోనని భావించి, దానిని కొరకడంతో బాంబు ఒక్కసారిగా భయంకరమైన శబ్దంతో పేలింది. భారీ పేలుడు శబ్దంతో రైల్వే స్టేషన్‌లో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. ప్రాణ భయంతో ప్రయాణీకులు పరుగులు తీశారు. అయితే, ఆ వీధి కుక్క బలిదానం వల్లే రైల్వే స్టేషన్‌లో జరగాల్సిన పెను ప్రమాదం, ప్రాణ నష్టం తప్పిందని పోలీసులు భావిస్తున్నారు. కుక్క ఆ బాంబును కొరకడం వల్లే అది పేలిందని, లేదంటే రైళ్లు వచ్చిన తర్వాత లేదా రద్దీగా ఉన్న సమయంలో పేలితే భారీ నష్టం వాటిల్లేదని స్టేషన్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే పోలీసులు, స్థానిక పోలీసులు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, ప్లాట్‌ఫామ్‌లు, ట్రాక్‌లపై గంటల తరబడి విస్తృత తనిఖీలు చేపట్టారు. మొన్నటి వరకు ప్రశాంతంగా ఉన్న కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో బాంబు పేలుడు సంఘటన కలకలం సృష్టించడం వెనుక వేటగాళ్లు ఉపయోగించే నాటు బాంబులా, లేక మరేదైనా కుట్ర కోణం దాగి ఉందా అనే దిశగా పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. ఈ ఘటన రైల్వే అధికారులతో పాటు రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులను సైతం అప్రమత్తం చేసింది.

## తూర్పు గోదావరి జిల్లాలో సీఎం చంద్రబాబు 'రైతన్న... మీ కోసం' కార్యక్రమం

మునుగోడు నియోజకవర్గంలో తన మాటే శాసనమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిరూపించుకున్నారు. నియోజకవర్గ పరిధిలో మద్యం దుకాణాల నిర్వహణపై ఆయన విధించిన కొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయి.'ఏ బిడ్డా ఇది నా అడ్డా!' అన్న రీతిలో ఆయన ఇచ్చిన ఆదేశాలకు వైన్ షాపుల యజమానులు కట్టుబడటం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజగోపాల్ రెడ్డి గతంలోనే ప్రకటించారు. నూతన మద్యం లైసెన్స్‌ల టెండర్ల ప్రక్రియ సందర్భంగానే ఆయన ఈ కఠిన నిబంధనలను స్పష్టం చేశారు.

## అదానికి భారీగా భూములు కేటాయిస్తున్న ఏపీ ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నం జిల్లాలో అదానీ గ్రూప్‌నకు చెందిన వివిధ సంస్థలకు భారీగా భూములను కేటాయిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా అత్యాధునిక డేటా సెంటర్‌ల ఏర్పాటు కోసం ఈ భూములను కేటాయించడం జరిగింది. అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ ఇన్ఫ్రా, ఆదాని కనెక్స్ ఇండియా, అదానీ పవర్ సంస్థలకు ప్రభుత్వం మొత్తం 480 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ భూములు జిల్లాలోని మూడు వేర్వేరు ప్రాంతాలలో ఉన్నాయి. తర్లువాడ 200 ఎకరాలు, రాంబిల్లి 160 ఎకరాలు, అడవివరం 120 ఎకరాలు. ఈ డేటా సెంటర్ల ప్రాజెక్టులో అదానీ సంస్థతో పాటు, ప్రముఖ టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ కూడా నోటిఫైడ్ భాగస్వామిగా ఉంది. రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా నోటిఫైడ్ పార్టనర్లుగా అదానీ, భారతీ ఎయిర్‌టెల్‌లు వ్యవహరిస్తున్నాయి. ఈ రెండు సంస్థలకు కూడా భూములు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భారీ భూ కేటాయింపులు విశాఖపట్నాన్ని డేటా సెంటర్ల హబ్‌గా మార్చే ప్రభుత్వ లక్ష్యానికి ఊతమిస్తున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రానున్నాయి. అలాగే, స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. డేటా సెంటర్ల ఏర్పాటుతో డిజిటల్ మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయి.

## చిత్రపురి కాలనీ అక్రమాల కేసు, 15 మందిపై తుది నివేదిక - రూ. 43.78 కోట్లు రికవరీకి సిఫారసు!

మణికొండలోని చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీలో జరిగిన అక్రమాల కేసులో విచారణ పూర్తయింది. 2005 నుంచి 2020 వరకు ప్లాట్ల కేటాయింపు, నిధుల దుర్వినియోగంలో జరిగిన అవకతవకలపై గోల్కొండ కో-ఆపరేటివ్ సొసైటీస్ డిప్యూటీ రిజిస్ట్రార్ కమిటీ జరిపిన విచారణకు సంబంధించిన తుది నివేదికను నవంబర్ 27న తెలంగాణ ప్రభుత్వానికి అందించారు.

చిత్రపురి కాలనీలో జరిగిన అక్రమాలకు 15 మందిని బాధ్యులుగా చేస్తూ కమిటీ తన తుది నివేదికలో పేర్కొంది. వీరిలో పాత, ప్రస్తుత కమిటీ సభ్యులు ఉన్నట్టు తెలిపింది. నివేదికలో పలువురు సినీ పెద్దల పేర్లు ఉన్నట్టు సమాచారం. కమిటీలో ఉంటూ నిధులు కాజేశారని నివేదికలో స్పష్టం చేశారు. ఈ అక్రమాల ద్వారా సొసైటీకి నష్టం వాటిల్లిన రూ.43.78 కోట్లు రికవరీ చేయాలని కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ మేరకు నివేదికలో పేర్లు ఉన్న 15 మందికి గోల్కొండ కో-ఆపరేటివ్ సొసైటీస్ డిప్యూటీ రిజిస్ట్రార్ నివేదిక కాపీని పంపినట్లు తెలిసింది. మాజీ ప్రెసిడెంట్లు కొమర వెంకటేశ్, నటుడు బినోద్ బాల, మాజీ సెక్రటరీ కృష్ణ మోహన్, మాజీ ట్రెజరర్, నటుడు పరుచూరి వెంకటేశ్వర రావు, ఎంసీ మెంబర్లు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, నటుడు కాదంబరి కిరణ్, అనిల్ కుమార్ వల్లభనేని సహా మొత్తం 15 మందిని బాధ్యులుగా పేర్కొన్నారు.

అల్పాదాయ వర్గాల సినీ కార్మికులకు కేటాయించాల్సిన ప్లాట్లను అక్రమంగా ఇతరులకు కట్టబెట్టడం సహా ఈ మొత్తం వ్యవహారంలో సుమారు రూ.300 కోట్ల వరకు కుంభకోణం జరిగిందని గతంలో ఆరోపణలు వచ్చాయి. చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీలో జరిగిన అక్రమాలకు సంబంధించి సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ గతంలో అరెస్ట్ అయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా జీ౦1 అనుమతికి బదులుగా జీ౦2, జీ౦3 నిర్మాణాలు చేపట్టారని గుర్తించిన అధికారులు, మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో అనుమతి లేని విల్లాలను ఇటీవల (2024, ఆగస్టులో) కూల్చివేశారు. ప్రభుత్వానికి తుది నివేదిక అందిన నేపథ్యంలో, ఈ అక్రమాలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం ఎటువంటి కఠిన చర్యలు తీసుకోనుంది? రికవరీ ప్రక్రియ ఎలా జరగనుంది అనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## స్టెరాయిడ్స్ ఉచ్చులో యువత , చాంద్రాయణగుట్టలో ఆటోలో ఇద్దరు మృతదేహాలు.

చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ కింద నిలిచి ఉన్న ఓ ఆటోలో ఇద్దరు యువకుల మృతదేహాలు లభించడం స్థానికంగా పెను కలకలం సృష్టించింది. ఈ దారుణ ఘటన వెనుక 'స్టెరాయిడ్స్ ఓవర్ డోస్' ఉందనే పోలీసుల ప్రాథమిక అనుమానం యావత్ నగర యువతను ఆందోళనకు గురిచేస్తోంది.

బుధవారం తెల్లవారుజామున చాంద్రాయణగుట్ట ప్రాంతంలోని రోమన్ హోటల్ ఎదురుగా నిలిపి ఉన్న ప్యాసింజర్ ఆటోలో ఇద్దరు యువకులు అచేతనంగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతులు జహంగీర్ (24), ఇర్ఫాన్ (25). వీరు స్థానిక ప్రాంతానికి చెందిన వారేనని గుర్తించారు. పోలీసుల దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. మృతదేహాల వద్ద ఇంజెక్షన్లు, సిరంజీలు, స్టెరాయిడ్స్‌కు సంబంధించిన నమూనాలు లభ్యం కావడంతో మృతికి కారణం మాదకద్రవ్యాలు ఓవర్ డోస్ గా పోలీసులు బలంగా అనుమానిస్తున్నారు. మృతి చెందిన జహంగీర్, ఇర్ఫాన్‌లు బాడీ బిల్డింగ్ కోసం ఇటీవల స్టెరాయిడ్స్ తీసుకుంటున్నట్లు సమాచారం.

ఘటనా స్థలంలో మూడు సిరంజీలు లభ్యం కావడంతో, సోమవారం రాత్రి మొత్తం ముగ్గురు వ్యక్తులు స్టెరాయిడ్స్ తీసుకున్నారని, అందులో ఇద్దరు డోస్ ఎక్కువై చనిపోయి ఉండవచ్చని, మూడో వ్యక్తి పారిపోయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ నివేదికతోనే మృతికి సంబంధించిన అసలు కారణం తేలనుంది. ఈ ఘటన హైదరాబాద్‌లోని యువతకు స్టెరాయిడ్స్, మాదకద్రవ్యాల ముప్పు ఎంత తీవ్రంగా ఉందో కళ్ళకు కట్టింది. జిమ్‌ల ముసుగులో అనధికారికంగా స్టెరాయిడ్స్ సరఫరా జరుగుతుందనే ఆరోపణలు చాలా కాలంగా ఉన్నాయి. తాజాగా జరిగిన ఈ విషాద ఘటన ఈ ఆరోపణలకు మరింత బలం చేకూర్చింది. యువత సరైన పర్యవేక్షణ లేకుండా, అతి తొందరగా కండలు పెంచాలనే ఉద్దేశంతో తీసుకుంటున్న ఈ మందులు ప్రాణాలను బలిగొంటున్నాయి. ఈ కోణంలో కూడా పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. జిమ్‌లకు, స్టెరాయిడ్స్ సరఫరాకు ఏమైనా లింకులు ఉన్నాయా అని ఆరా తీస్తున్నారు. ఘటనా స్థలంలో దొరికిన ఆధారాలను బట్టి స్టెరాయిడ్స్ ఓవర్ డోస్ కారణంగా మృతి సంభవించిందని ప్రాథమికంగా భావిస్తున్నాం. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నాం. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాం. పోలీసులుపోస్టుమార్టం నివేదిక కోసం పోలీసులు ఎదురుచూస్తున్నారు. పరారీలో ఉన్నట్లు భావిస్తున్న మూడో వ్యక్తి కోసం గాలింపు ముమ్మరం చేశారు.

## మునుగోడులో 'రాజన్న రూల్స్' అమలు మధ్యాహ్నం 1 గంట తర్వాతే వైన్స్ ఓపెన్!

మునుగోడు నియోజకవర్గంలో వైన్ షాపులు, పర్మిట్ రూమ్‌ల నిర్వహణకు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి విధించిన ముఖ్య నిబంధనలు,మద్యం దుకాణాలు ఉదయం 10 గంటలకు బదులుగా, మధ్యాహ్నం 1 గంట దాటితేనే తెరవాలి. పర్మిట్ రూమ్‌లలోకి అనుమతి సాయంత్రం 6 గంటల తరువాతే ఉంటుంది. పగటిపూట పర్మిట్ రూమ్‌లు మూసివేయాలి. మద్యం దుకాణాలను ఊరి బయటే ఏర్పాటు చేయాలి. మద్యం దుకాణాల యజమానులు బెల్టు షాపులకు మద్యం అమ్మకాలు జరపడానికి వీల్లేదు. ఈ ఆదేశాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. వ్యాపారులు సిండికేట్ కాకూడదు. ఈ నిబంధనలకు లోబడే మద్యం దుకాణాలు నడపాలని, లేదంటే దుకాణాలను అప్పగించి వెళ్ళిపోవాలని ఆయన వ్యాపారులను హెచ్చరించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఎక్సైజ్ పాలసీకి విరుద్ధంగా రాజగోపాల్ రెడ్డి సొంత నిబంధనలు పెట్టడంపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. రాష్ట్రం మొత్తం ఒకే ఎక్సైజ్ పాలసీ అమలులో ఉంటుందని, నియోజకవర్గానికి ప్రత్యేక రూల్స్ ఉండవని ఆయన గతంలోనే తేల్చి చెప్పారు. అయినప్పటికీ, మునుగోడులో కొత్తగా లైసెన్సులు పొందిన వైన్ షాపుల యజమానులు ఎమ్మెల్యే మాటకే కట్టుబడి నేటి నుంచి నూతన నిబంధనలను అమలు చేయడం విశేషం. బెల్టు షాపుల నిర్మూలన, మద్యం దుకాణాల సమయ నియంత్రణ ద్వారా మునుగోడును రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా నిలబెట్టాలని రాజగోపాల్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.

## పవన్ కల్యాణ్‌పై కవిత తీవ్ర వ్యాఖ్యలు, పవన్ ముందు నుంచే తెలంగాణ వ్యతిరేకి

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పవన్ కల్యాణ్ తెలంగాణ నాయకుల దిష్టి కళ్లతోని కోనసీమ పాడైంది అంటూ చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. పవన్ కల్యాణ్ ముందు నుంచీ తెలంగాణకు వ్యతిరేకి అని కవిత స్పష్టం చేశారు.

ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం మా బిడ్డలు ప్రాణత్యాగాలు చేశారు. సినిమా నటుడిగా ఉన్నప్పటి నుంచీ ఇప్పటివరకు పవన్ కల్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగానే ఉన్నారు అని కవిత మండిపడ్డారు. తెలంగాణ నాయకుల దిష్టి కళ్లతో కోనసీమ పాడైందని ఆయన అంటున్నారు. తెలంగాణ ప్రజలు ఏనాడు దిష్టి పెట్టలేదు. కోనసీమ మాదిరిగా తెలంగాణ కావాలని మాత్రమే మేము కోరుకున్నాం అని కవిత వివరించారు. తెలంగాణ బిడ్డల మనసు చాలా గొప్పది. మేము పెద్దగా ఆలోచిస్తాం. పక్కోడు బాగుంటే మా కళ్లు మండవు. పక్కోనిది గుంజుకోవాలనుకునే వాళ్లం కాదు. మేము బాగుండాలనే కోరుకుంటాం కానీ, పక్కోడు చెడిపోవాలని అనుకోం అని ఆమె అన్నారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లయినా తాము "జై తెలంగాణ, జై ఆంధ్ర" అనే అంటున్నామని, ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇవ్వాలని తాను పార్లమెంట్‌లో కూడా మాట్లాడానని కవిత గుర్తుచేశారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎం అని, ఆయన మాటలు ఆంధ్రా ప్రజలకు ఆపాదిస్తారని, కనుక జాగ్రత్తగా ఆలోచించి మాట్లాడాలి అని ఆమె హితవు పలికారు.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల వివాదం, వక్రీకరించవద్దు అంటూ జనసేన ప్రకటన

మొదటి పేజీ తరువాయి

ఈ నష్టానికి సాంకేతిక కారణాలతో పాటు, తెలంగాణ నేతల దిష్టి తగిలిందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర విభజనకు కూడా గోదావరి జిల్లాల పచ్చదనమే ఒక కారణమని తెలంగాణ నేతలు అన్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. "నరుడి దిష్టి నల్ల రాయినైనా పగలగొడుతుంది" అన్నట్లుగా, కొబ్బరి చెట్లకు కూడా దిష్టి తగిలి ఉంటుందని ఆయన చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణలోని రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక ఉప ముఖ్యమంత్రి స్థానంలో ఉండి, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య సోదరభావం ఉన్న సమయంలో ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని వారు ఖండించారు. బేషరతుగా క్షమాపణ చెప్పాలని తెలంగాణ వాదులు, పలువురు నేతలు గట్టిగా డిమాండ్ చేశారు. కొందరు, పవన్ కళ్యాణ్ సినిమాలను తెలంగాణలో విడుదల కానివ్వమని కూడా హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి.'మాటలను వక్రీకరించవద్దు' ఈ వివాదం నేపథ్యంలో, జనసేన పార్టీ తాజాగా ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కోనసీమలో చేసిన వ్యాఖ్యలను కొంతమంది కావాలని, ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నారని జనసేన ఆరోపించింది. తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న సోదరభావాన్ని దెబ్బతీసేలా పవన్ కళ్యాణ్ మాటలను వక్రీకరించవద్దని జనసేన పార్టీ ప్రజలకు మరియు మీడియాకు విజ్ఞప్తి చేసింది. ఈ ప్రకటన ద్వారా, పవన్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకుండా, వాటిని వక్రీకరించారనే వాదనను జనసేన తెరపైకి తెచ్చింది.

## సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ డిమాండ్

మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి హిందువులకు క్షమాపణలు చెప్పాలి. హిందూ దేవతలపై ఆయన ఉపయోగించిన భాష అభ్యంతరకరం, ద్వేషపూరితం. నీకు దమ్ము, ధైర్యం ఉంటే అల్లా, జీసస్ గురించి ఇలానే మాట్లాడు. అని ఆయన సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. రైల్వే స్టేషన్, బస్ స్టాండ్లలో టైమ్‌టేబుల్ మారినట్టు పార్టీలు మారే నువ్వు కూడా హిందూ దేవుళ్ల గురించి మాట్లాడతావా? అంటూ రేవంత్ రెడ్డి రాజకీయ ప్రయాణాన్ని ఎత్తి చూపుతూ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో పెద్ద వివాదానికి దారితీశాయి. హిందూ దేవతలపై ఆయన చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని పేర్కొంటూ టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి క్షమాపణ డిమాండ్ చేయడంతో పాటు, బీజేపీ రాష్ట్ర నాయకులు, ఇతర హిందూ సంస్థలు కూడా ముఖ్యమంత్రిపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి.

## లేని సామాజికవర్గాలకు రిజర్వేషన్‌లా? పది మంది ఉన్నా.. నాలుగైదు పదవులా?

మొదటి పేజీ తరువాయి

పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. కొన్ని గ్రామాల్లో ఎస్టీలు లేకపోయినా ప్రభుత్వం వారికే సర్పంచ్ స్థానంతోపాటు వార్డు మెంబర్ స్థానాలను రిజర్వు చేసిందని తెలిపారు.

ఒక వర్గానికి చెందినవారు కేవలం ఆరుగురు ఓటర్లు ఉంటే వారికి సర్పంచ్ స్థానంతోపాటు రెండు వార్డులు, 8 మంది ఓటర్లున్నా సర్పంచ్ స్థానాన్ని రిజర్వు చేశారని చెప్పారు. అందువల్ల రిజర్వేషన్లు సవరించి తాజా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న సింగిల్‌బెంచ్ ధర్మాసనం రిజర్వేషన్ల తీరుపై ఆశ్చర్యం వ్యక్తంచేసింది. తాము ఎలాంటి ఆదేశాలిచ్చినా దాని పరిణామాలు తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని డివిజన్ బెంచ్‌కు నివేదించాలని ఉత్తర్వులను జారీ చేశారు. ఈ పిటిషన్లలో పేర్కొన్న పంచాయతీలను ఇతరులకు రిజర్వు చేయాలంటూ ఉత్తర్వులు జారీచేస్తే అవి రోస్టర్ ప్రకారం కేటాయించిన రిజర్వేషన్లపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతోపాటు విస్తృత పరిణామాలకు దారి తీస్తాయని, ఖజానాకు నష్టం ఏర్పడినా దానివల్ల ప్రయోజనమూ ఉండదని అన్నారు. అందువల్ల ఈ పంచాయతీ ఎన్నికలపై డివిజన్ బెంచ్ తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, ఈ పిటిషన్లను బుధవారం డివిజన్ బెంచ్ ముందుంచాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేశారు.

అణగారిన వర్గాలకు అధికారం కోసమే రిజర్వేషన్లు

సామాజిక న్యాయంతోపాటు చారిత్రకంగా అణగారినవర్గాలకు రాజకీయ పదవుల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించడానికి రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పించిందని న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి పేర్కొన్నారు. రాజ్యాంగంలోని అధికరణం 243-డీ, 243-టీ ప్రకారం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో రిజర్వేషన్లు అందించాల్సి ఉందని చెప్పారు. గ్రామ స్వయం పాలన నిమిత్తం ఏర్పాటయ్యే కార్యనిర్వాహక సంస్థ పంచాయతీ అని, ఇది స్థానిక సౌకర్యాల కల్పన, అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలుకు జవాబుదారీగా ఉండేలా పంచాయతీ ప్రతినిధులను ప్రజలు నేరుగా ఎన్నుకోవడం ద్వారా స్వయం పాలన వ్యవస్థ ఏర్పాటవుతుందని వివరించారు. పలు రాష్ట్రాలు ఎస్టీ, ఎస్సీ బీసీ, మహిళలకు పాలనలో ప్రాతినిధ్యం, భాగస్వామ్యం కల్పించడానికి వీలుగా రిజర్వేషన్ల కల్పనకు చట్టాలున్నాయని తెలిపారు. అయితే సంబంధిత వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించకపోతే ఈ సూత్రాలు వీగిపోతాయని వ్యాఖ్యానించారు.

ఎస్టీలు లేని గ్రామంలో రిజర్వేషన్!

అంతకుముందు పిటిషనర్ల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. వరంగల్ జిల్లా సంగెం మండలం వంజరపల్లి పంచాయతీలో ఎస్టీ ఓటరు ఒకరూ లేరని అయినా సర్పంచ్‌తోపాటు మూడు వార్డు మెంబరు స్థానాలను ఎస్టీలకు రిజర్వు చేశారని చెప్పారు. సంగెం మండలం ఆశలపల్లి గ్రామంలో 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచ్ స్థానంతోపాటు రెండు వార్డు మెంబరు స్థానాలను ఎస్సీలకు రిజర్వు చేశారని తెలిపారు. నల్లగొండ జిల్లా అనుముల మండలం శివాలయం పేరూరు గ్రామంలో ఎస్టీలే లేరని, అయినా సర్పంచ్ తోపాటు 4 వార్డు మెంబర్లను ఎస్టీలకు కేటాయించారని చెప్పారు.

అదే జిల్లాలోని కేసముద్రం మండలం మహమూద్ పట్నం గ్రామంలో కేవలం ఆరుగురు ఎస్టీ ఓటర్లు ఉంటే ఒక సర్పంచ్, రెండు వార్డు స్థానాలను ఎస్టీలకు రిజర్వు చేశారని, సర్పంచ్ పోస్టును ఎస్టీ మహిళకు కేటాయించారని వివరించారు. దీనిపై 2024లోనే వినతి పత్రం సమర్పించినా పట్టించుకోలేదని తెలిపారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం తకలపల్లి గ్రామ సర్పంచ్ స్థానాన్ని ఎస్టీలకు రిజర్వు చేశారని, కానీ ఈ గ్రామంలో ఎస్టీలు కేవలం 13 మంది ఉండగా అందులో ఓటర్లు 8 మంది మాత్రమేనని తెలిపారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా, కాగజ్‌నగర్ మండలం, భట్‌పల్లి జీపీ సర్పంచ్, 6 వార్డు మెంబరు స్థానాలను ఎస్టీలకు 2011 జనాభా లెకల ప్రకారం రిజర్వు చేశారని పేర్కొన్నారు.

## తెలంగాణ రైజింగ్ సదస్సుకు రండి..

### ప్రధాని మోడీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

రాహుల్, ఖర్గేకు ఆహ్వానం..

ప్రధానితో భేటీకి ముందు కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్?ను ముఖ్యమంత్రి కలిసి గ్లోబల్ సమ్మిట్?కు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా సమ్మిట్?లో ఆవిష్కరించనున్న విజన్ డాక్యుమెంట్ గురించి ఆయనకు వివరించారు. ప్రధానితో భేటీ అనంతరం కేంద్రమంత్రులు రాజ్ నాథ్ సింగ్, నిర్మాలా సీతారామన్‌తో సీఎం భేటీ అయి సమ్మిట్‌కు రావాలని కోరారు. ఈ భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, కుందూరు రఘువీర్‌రెడ్డి, సురేశ్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్ ఉన్నారు. అలాగే ఏఐసీసీ చీఫ్ ఖర్గేతోపాటు లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీని సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. ఉదయం పార్లమెంట్ భవనంలోనే వీరితో భేటీ అయి గ్లోబల్ సమ్మిట్‌కు రావాల్సిందిగా ఆహ్వానించారు.

## ఫార్ములా ఈ-రేసు కేసులో బిగ్ అప్‌డేట్...

### అరవింద్ కుమార్‌పై చర్యలకు DoPTకి సీఎస్ లేఖ

మొదటి పేజీ తరువాయి

కాగా, ఇదే కేసులో ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిగా ఉన్నారు. అయితే, గతంలో హెచ్ఎండీఏ కమిషనర్‌గా పనిచేసిన అరవింద్ కుమార్ కేబినెట్, ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా, ఎన్నికల కోడ్ అమలుల్లో ఉండగా నిధులను మళ్ళించడంలో కీలక పాత్ర పోషించారని ఏసీబీ ఆరోపిస్తోంది. దేశంలో ఐఏఎస్ అధికారులపై కేసు విచారణ, అభియోగాలు నమోదు చేసేందుకు ముందుగా కేంద్రంలోని DoPT నుంచి ప్రాసిక్యూషన్ అనుమతి తప్పనిసరి కావడంతో సీఎస్ రామకృష్ణా రావు తాజాగా లేఖ రాయడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

## భూముల ధరకు రెక్కలు..

## అక్కడ ఎకరా రూ.151.25 కోట్లు !

మొదటి పేజీ తరువాయి

9.06 ఎకరాలకు.. రూ.1352కోట్లు.

కోకాపేట్ లో సుమారు రూ.300 కోట్లకుపైగా ఖర్చుతో 40 ఎకరాలతో కూడిన నియోపొలిస్ లేఅవుట్ ను హెచ్ఎండీఏ డెవలప్ చేసింది. ఈ లేఅవుట్ లో హెచ్ఎండీఏ సకల సౌకర్యాలను కల్పించింది. ఫలితంగానే రికార్డు స్థాయి రేట్లు పెట్టి కొనుగోలు చేస్తున్నారని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. ఈ లేఅవుట్ లోని ఎకరాకు హెచ్ఎండీఏ రూ.99 కోట్లు ప్రారంభ ధరగా నిర్ణయించింది. 15వ నెంబర్ ప్లాట్ లోని ఎకరాకు రూ.151.25 కోట్లు వెచ్చించి 4.03 ఎకరాలను రూ.609 కోట్లతో జీహెచ్ఆర్ లక్ష్మీ ఇన్ ఫ్రా అర్బన్ బ్లాక్స్ సంస్థ దక్కించుకున్నది. 16వ నెంబర్ ప్లాట్ లోని ఎకరా రూ.147.75 కోట్ల చొప్పున 5.03 ఎకరాలను రూ.743 కోట్లతో గోద్రేజ్ ప్రాపర్టీస్ లిమిటెడ్ సంస్థ దక్కించుకున్నది.

కోకాపేట్ లోని నియోపొలిసు లేఅవుట్ లో 15 నుంచి 20 వరకు ఆరు ప్లాట్లకు ఈ–వేలం వేయాలని హెచ్ఎండీఏ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఎకరాకు ప్రారంభ ధర రూ.99 కోట్లు నిర్ణయించారు. అయితే ఈ నెల 24వ తేదీన 17, 18 ప్లాట్లకు వేలం వేశారు. 18వ ప్లాట్ లో ఎకరాకు రూ.137.25కోట్లు వెచ్చించి 5.31ఎకరాలను రూ.728.79కోట్లతో ఎంఎస్ఎన్ అర్బన్ వెంచర్స్ ఎల్ఎల్పీ సంస్థ దక్కించుకున్న విషయం తెలిసిందే. దీంతోపాటు ఎకరాకు రూ.136.50 కోట్ల చొప్పున 4.59ఎకరాలను రూ.626.53 కోట్లతో వజ్రా హౌసింగ్ ప్రాజెక్టు ఎల్ఎల్పీ సంస్థ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ రెండు ప్లాట్ల ద్వారా హెచ్ఎండీఏకు రూ.1356కోట్ల ఆదాయం వచ్చింది. నాలుగు ప్లాట్ల ద్వారా హెచ్ఎండీఏకు రూ.2,708 కోట్ల ఆదాయం రావడం హర్షనీయమని మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. నియోపొలిస్ లోని ఆరు ప్లాట్లకు గాను ఇప్పటికే నాలుగు ప్లాట్లకు వేలం పాటను పూర్తి చేశారు. మరో రెండు ప్లాట్లతోపాటు కోకాపేట్ లోని గోల్డ్ మైన్ లేఅవుట్ తోపాటు మూసాపేట్ లోని 15 ఎకరాల భూములకు సైతం వేలం నిర్వహించనున్నారు.

## 80 వేల మంది చూస్తుండగా.. కాల్చి చంపిన 13 ఏళ్ల బాలుడు.. భక్తితో నినాదాలు చేసిన జనాలు

మొదటి పేజీ తరువాయి

ఈ శిక్ష భవిష్యత్తులో నేరాలు చేయకుండా అడ్డుకుంటుందని అభిప్రాయపడ్డాడు. ఇకపై ఎవరూ ఎవరినీ చంపడానికి సాహసించరు అని అన్నాడు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరు కావాలని అధికారికంగా ప్రకటనలు కూడా జారీ చేశారని తెలిపాడు.

నివేదికల ప్రకారం 2025 జనవరిలో బాధిత కుటుంబంపై కొందరు దుండగులు దాడి చేశారు. వీరిలో మంగల్ అనే నిందితుడు ఉన్నాడు. ఈ దాడిలో చనిపోయిన వారిలో ముగ్గురు మహిళలతో సహా మరో పది మంది మరణించారు. దాడిలో పాల్గొన్న మంగల్‌కి బహిరంగ మరణశిక్ష విధించారు. అయితే ఈ తీర్పును ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల నివేదికకర్త రిచర్డ్ బెన్నెట్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది అత్యంత క్రూరమైన అమానవీయ అసాధారణ శిక్ష. ఈ తీర్పు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం అని అన్నారు.

తాలిబన్ల పాలనలో బహిరంగ మరణశిక్షలు సర్వసాధారణం. గతంలో 1996–2001 వరకు కొనసాగిన తాలిబన్ల పాలనలో తరచుగా బహిరంగ మరణశిక్షలు విధించేవారు. అప్పట్లో క్రీడా మైదానాల్లోనే ఈ శిక్షలు అమలు చేసేవారు. 2021లో తాలిబన్లు తిరిగి అధికారం చేపట్టిన తర్వాత ఇది 12వ బహిరంగ మరణశిక్ష. దీనికి ముందు అక్టోబర్‌లో బాధిస్‌లో 11వ కేసు నమోదైంది.

ఇంతకుముందు ఏప్రిల్‌లో, అధికారులు మూడు వేర్వేరు ప్రావిన్సుల్లో నలుగురు వ్యక్తులకు ఒకేసారి మరణశిక్ష విధించారు. దొంగతనం, వ్యభిచారం, మద్యం సేవించడం వంటి నేరాలకు తాలిబన్లు ఇప్పటికీ కొరడాలతో కొట్టడం వంటి శారీరక శిక్షలను అమలు చేస్తున్నారు. అయితే ఈ బహిరంగ మరణశిక్షలకు కందహార్‌లో ఉన్న తాలిబన్ల సుప్రీం నాయకుడు హిబతుల్లా అఖుంద్జాదా ఆమోదం తప్పనిసరి.

## సర్పంచ్ ఎన్నికల నామినేషన్ పత్రాలు చోరీ..

పెద్దేముల్ మండలంలోని, గొట్లపల్లి, హన్మపూర్, గిర్మాపూర్, జైరాం తండా (ఐ) గ్రామ పంచాయతీలకు కలిపి గొట్లపల్లి క్లస్టర్ నామినేషన్‌ల కేంద్రం ఏర్పాటు చేసి నామినేషన్‌లు స్వీకరించారు. కాగా బుధవారం ఉదయం గ్రామ పంచాయతీ వర్కర్‌లు నామినేషన్ స్వీకరణ కేంద్రమైన గోట్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తెరవాడానికి చూడగా కార్యాలయానికి వేసిన తాళం తెరిచి ఉంది. లోపల చూడగా నామినేషన్ పత్రాలు చిందరవందరగా పడి ఉన్నాయని సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి పరమేశ్, ఎన్నికల నిర్వాణ అధికారులు గొట్లపల్లి క్లస్టర్ ఆర్ఓ కోటయ్య, ఏ ఆర్ఓ అంజయ్య, వచ్చి చూశారు.

హన్మాపూర్, గిర్మాపూర్, జైరాం తండా గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్ పత్రాలు కనబడకపోవడంతో పెద్దేముల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెద్దేముల్ ఎస్సై శంకర్ కార్యాలయానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, తాండూర్ డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, ఎమ్మార్వో వెంకటేష్ ప్రసాద్, ఎంపీడిఓ రతన్ సింగ్, అక్కడికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొన్ని పత్రాలు మిస్ అయ్యాయని, కానీ అన్ని నామినేషన్ పత్రాలు ఆన్లైన్‌లో పొందుపర్చడంతో ఎన్నికలకు ఎలాంటి ఆటంకం లేదని ఎన్నికల ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని అన్నారు.

## సంచలనం.. IBOMMA రవికి సైబర్ క్రైంలో జాబ్ ఆఫర్?

నాంపల్లి కోర్టులో మరోసారి ఐబొమ్మ రవి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. కాగా గురువారం బెయిల్ పిటిషన్ పై వాదనలు వినిపించే అవకాశం ఉంది. ఇప్పటికే రెండు సార్లు రవిని పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించారు. విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చినట్టు తెలుస్తోంది. విచారణ సమయంలో రవికి పోలీసులు భారీ ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. సైబర్ క్రైమ్ విభాగంలో పనిచేయాలని పోలీసులు అడిగినట్టు తెలుస్తోంది. కానీ రవి పోలీసుల ఆఫర్ ను సున్నితంగా తిరస్కరించారట.

అంతే కాకుండా ఇంతకాలం పైరసీ సినిమాలు చేస్తూ కాలం గడిపిన రవి కరేబియన్ దీవుల్లో తలదాచుకున్న సంగతి తెలిసిందే. కాగా తరవాత కూడా కరేబియన్ దీవులకు వెళ్లి ఐబొమ్మ పేరుతో రెస్టారెంట్ బిజినెస్ పెడతానని చెప్పినట్టు సమాచారం. అంతే కాకుండా ఐబొమ్మ ద్వారా రూ.17 కోట్లు సంపాదించి మొత్తం ఎంజాయ్ చేయడానికే ఖర్చు చేశానని చెప్పినట్టు తెలుస్తోంది. ఇప్పటికే పోలీసులు రవి అకౌంట్ లోని రూ.3 కోట్లను సీజ్ చేయగా తన భవిష్యత్ ప్రణాళికను వారికి వివరించినట్టు సమాచారం.

## రేవంత్ రెడ్డి ఎలక్షన్ కోడ్ ఉల్లంఘిస్తున్నారు

### ప్రధాన ఎన్నికల అధికారికి కవిత లేఖ

పంచాయితీ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఎన్నికల అధికారులకు లేఖ రాశారు. దానిని ఆపాలని లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లా కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల తరుపున ప్రచారం కోసం సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే దీనిపై జాగృతి ఫిర్యాదు చేసిందని గుర్తు చేశారు.

డిసెంబర్ 1వ తేదీన రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థుల తరుపున రేవంత్ ప్రచారం చేశారన్నారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల పేరుతో గ్రామీణ ఓటర్లను ప్రలోభపెట్టే పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డిసెంబర్ 2న కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల కోసం ప్రచారం చేశారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించనున్నారని ఆరోపించారు. ఆయన మాట్లాడిన వీడియో క్లిప్పింగ్స్ జత చేస్తున్నామని చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారిని కోరారు.

## హిల్ట్ పాలసీ లీక్ పై తెలంగాణ ప్రభుత్వం సీరియస్

హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీకి సంబంధించిన విధాన నిర్ణయం జీవో విడుదల కాకముందే దీనికి సంబంధించిన సమాచారం ప్రతిపక్షాలకు లీక్ కావడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. పాలసీని తీసుకురావాలని కసరత్తు చేస్తున్న దశలోనే సమాచారం లీకై ప్రతిపక్షాలకు చేరడంపై దృష్టి సారించింది. ఈ లీకుల వ్యవహారంలో నిగ్గు తేల్చేందుకు తాజాగా ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. నవంబర్ 20 న ఫోటోషాప్ స్లైడ్స్ బయటకు వచ్చినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ మరుసటి రోజు నవంబర్ 21న హిల్ట్ పాలసీపై ప్రతిపక్ష నేత కేటీఆర్ ప్రెస్‌మీట్ పెట్టిన ప్రభుత్వ పాలసీపై విమర్శలు గుప్పించారు. అయితే నవంబర్ 22న ప్రభుత్వం జీవో విడుదల చేయగా అంతకు ముందురోజే కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించడం వెనుక సమాచార లీకుల వ్యవహారం ఉందనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఈ క్రమంలో ఇప్పటికే శాఖాపరమైన విచారణకు ఆదేశించిన అధికారులు తాజాగా విజిలెన్స్ విచారణకు ఆదేశించారు.

## అరావళి కొండలకు మోదీ ప్రభుత్వం 'మరణశాసనం' రాసింది: సోనియా గాంధీ



అటవీ, పర్యావరణ పరిరక్షణ పై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర స్థాయిలో స్పందించారు. మోడీ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యంగా "దుర్మార్గపు నిస్సత్తువ"ను ప్రదర్శించిందని ఆరోపించారు. ఈ ప్రభుత్వం ఇప్పుడు అరావళి కొండలకు "మరణ శాసనం" రాసినట్లేనని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పర్యావరణ రక్షణకు సంబంధించి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఆమె తీవ్రంగా విమర్శించారు.

పార్లమెంట్ ఆవరణలో సోనియా గాంధీ మాట్లాడుతూ.. ప్రభుత్వం పార్లమెంటులో "బుల్డోజ్" చేసిన అటవీ (సంరక్షణ) చట్టం, 1980 సవరణలను, అటవీ సంరక్షణ నియమాలు (2022) ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అరావళి శ్రేణిలోని 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తు ఉన్న ఏ కొండ అయినా మైనింగ్ ఆంక్షలకు లోబడి ఉండదని ప్రభుత్వం ప్రకటించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఎత్తు పరిమితి కంటే తక్కువగా ఉన్న అరావళి శ్రేణిలోని 90% భాగాన్ని అక్రమ మైనింగ్ మాఫియాలు సర్వనాశనం చేయడానికి ఇది బహిరంగ ఆహ్వానమని ఆమె ఆరోపించారు.

## ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం.. మిల్స్ కాలనీలో ఘటన

వరంగల్ జిల్లా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ యువకుడు ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రాంతంలో వేల్పుల కమల్ అనే యువకుడు కిరాణా షాప్ నిర్వహిస్తుంటాడు. ఈ నెల రెండవ తేదీ రాత్రి కిరాణా దుకాణంలో సరుకులు కొనేందుకు వెళ్లిన 8 ఏళ్ల బాలికను లైంగిక దాడి చేసేందుకు ప్రయత్నించాడు.

ఆ సమయంలో దుకాణానికి వేరే వారు రావడంతో పాప బయటికి పరిగెత్తుకుంటూ వెళ్లి వచ్చి విషయం తల్లిదండ్రులకు తెలిపింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పాలడుగు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నిమ్మల సురేష్ నామినేషన్



మోత్కూర్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): యాద్రాది భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని పాలడుగు గ్రామ సర్పంచ్ బీఎస్పీ పార్టీ అభ్యర్థిగా నిమ్మల సురేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఆ పార్టీ నాయకులతో కలిసి నామినేషన్ పత్రాలను బుధవారం ఎన్నికల అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా నిమ్మల సురేష్ మాట్లాడుతూ పాలడుగు గ్రామఅభివృద్ధి కోసం, సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నానని, యువతీయువకులు, గ్రామస్తులంతా తనకు మద్దతుగా నిలవాలని, ఓటు వేసి తనను గెలిపించాలని అన్నారు.

## తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ ట్రాప్..!

## లంచం తీసుకుంటూ పట్టుబడిన ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్


### డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ల కోసం డాక్యుమెంట్ రైటర్ల ద్వారా వసూళ్లు

### ఏసీబీ స్కెచ్‌తో ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్, ఇద్దరు రైటర్ల అరెస్టు



వికారాబాద్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ గా పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ లంచావతారం ఎత్తారు. డబ్బులిస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని.. ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్ల ద్వారా వసూళ్లకు పాల్పడ్డాడు. రిజిస్ట్రార్, ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లను అరెస్టు బాధితుని ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి లంచం తీసుకుంటున్న ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్లను అరెస్టు చేశారు. ఈ సంఘటన బుధవారం జరిగింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాండూరు ప్రాంతానికి చెందిన ఓ రియల్ ఏస్టేట్ వ్యాపారి తనకు చెందిన భూమిని 11 డాక్యుమెంట్లుగా చేసి కుటుంబ సభ్యులతో పాటు విక్రయదారులకు రిజిస్ట్రేషన్ చేయాలని తాండూరు సబ్ కార్యాలయంలో సంప్రదించారు. ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ గా పనిచేస్తున్న సాయికుమార్(జూనియర్ అసిస్టెంట్) డాక్యుమెంట్లు సరిగ్గాలేవని వంకలు పెడుతూ నిరాకరించారు. కార్యాలయం ముందు ఉన్న ఓ ఆఫీసులు ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్ గా పనిచేస్తున్న అశోక్, అసిస్టెంట్ డాక్యుమెంట్ రైటర్ సాయిలు సదరు వ్యాపారి రిజిస్ట్రేషన్ లు చేయించేందుకు ఒప్పందం చేసుకున్నారు. ముందుగా ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేయాలంటే రూ. 2వేలు చొప్పున ఇవ్వాలని ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ కోరారని డాక్యుమెంట్ రైటర్లు సదరు వ్యాపారికి తెలిపారు. మరోసారి మాట్లాడగా ఒక్కో డాక్యుమెంట్ కు రూ. 1500ల చొప్పున రూ. 16500లు ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. అంత డబ్బులు ఇవ్వడం ఇష్టంలేని వ్యాపారి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో ఏసీబీ రంగారెడ్డి రేంజ్ డీఎస్పీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో బృందం ట్రాప్ చేశారు. అప్పటికే ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ సాయి 4 డాక్యుమెంట్ లను రిజిస్టర్ చేశారు. మిగతా వాటిని చేయాలంటే రూ. 16500లు ఇవ్వాలని మరోసారి లంచం డిమాండ్ చేశారు. బుధవారం ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ సాయి డాక్యుమెంట్ రైటర్లు అశోక్, సాయిల ద్వారా డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మూసి వేసి.. విచారణ చేపట్టారు. మరోవైపు నిందితుల ఇళ్ల వద్ద కూడా సోదాలు నిర్వహించారు. పూర్తి విచారణ జరిపి ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ సాయి. డాక్యుమెంట్ రైటర్లు అశోక్, సాయిలను అరెస్టు చేయడం జరిగిందని ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎట్టి పరిస్థితులలో అక్రమంగా మద్యం నిల్వ,అమ్మకాలు చేయకూడదు -ఎస్సై సురేష్



నరసింహుల పేట, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): నరసింహుల పేటమండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు తెలియజేయునది ఏమనగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నందున ఎట్టి పరిస్థితులలో అక్రమంగా మద్యం నిల్వ,అమ్మకాలు చేయకూడదు, బెల్ట్ షాప్స్ నడపకూడదు.ఊర్లోని ప్రజలు ఎవరు కూడా సోషల్ మీడియా లో ఎలాంటి రెచ్చగొట్టే వాక్యలు గాని,శాంతి భద్రతలకు విఘాతాం కలిగించే చర్యలు గాని చేయకూడదు,చేసినచో తాసిల్దార్ కార్యాలయం ఎమ్మార్వో ముందు బైండోవర్ చేసి మరియు చట్టపరమైన చర్యలు తీసుకోబడును.పంచాయితీ ఎన్నికలు సజావుగా జరిగేటట్లు మండలంలో ఉన్న గ్రామాలు ప్రజలుఅందరూ సహకరించగలరు.మీకు ఏదైనా సమస్యలు ఉంటే 100 సపంప్రదించగలరనిస్థానిక ఎస్సై మాలోత్ సురేష్ క్రాంతి న్యూస్ మీడియాతో బుధవారం ఆయన తెలిపారు.


## పెద్దమందడి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించండి

### సర్పంచ్ అభ్యర్థి స్వాతి హరి కుమార్ రెడ్డి(బుచ్చిబాబు)



వనపర్తి, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): పెద్దమందడి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నేను స్వాతి హరి కుమార్ రెడ్డి (బుచ్చిబాబు) పెద్దమందడి గ్రామంలో ఉన్నటు వంటి మహిళలు, యువకులు, విద్యావంతులు, కులాలకు, మతాలకు,అతీతంగా మా కుటుంబ సభ్యుల అభిమానులు మీరు అందరూ కలిసి మీ అమూల్యమైన ఓటును బ్యాట్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వారు మాట్లాడుతూ...పెద్దమందడి గ్రామంలో ఉన్నటు వంటి అభివృద్ధి పనులను మేము చేయడానికి ముందుకు వస్తున్నాము అని మీరు ఆశీర్వదించి గెలిపించగలరని కోరారు.

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలి -సీపీఐ నారాయణ డిమాండ్



ఏపీ న్యూస్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): ఏపీ డిప్యూటీ సీఎం పదవికి పవన్ కళ్యాణ్ అనర్హుడని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కే నారాయణ విమర్శించారు. ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కోనసీమ జిల్లా పర్యటన సందర్భంగా పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టేలా, ఐక్యతకు భంగం కలిగించేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాలు సాంకేతికంగా విడిపోయినప్పటికీ.. ప్రజలు కలిసే ఉన్నారని నారాయణ తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుమార్తెను ఏపీలోని భీమవరం ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చిన తొలిరోజుల్లో తనకు చేగువేరా ఆదర్శమని చెప్పాడని.. ఇప్పుడు సావర్కర్‌ను భుజాన వేసుకుని సనాతన ధర్మం అంటూ తిరుగుతున్నాడని విమర్శించారు. సనాతన ధర్మం కోసం తిరగాలని అనుకుంటే తమకేమీ అభ్యంతరం లేదని.. కాకపోతే రాజకీయాలను వదిలేసి ఆ పనిచేసుకోవాలని హితవుపలికారు.

దిష్టి తగిలింది వంటి మాటలు మాట్లాడే సనాతనవాదికి రాజకీయాల్లో ఉండే అర్హత లేదని నారాయణ వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ రాజకీయాలకు తగడని పేర్కొన్నారు. తక్షణమే పవన్ కల్యాణ్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

## ఆంధ్రప్రదేశ్ రాజ్‌భవన్ పేరు 'లోక్‌భవన్' గా మార్పు



ఏపీ న్యూస్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లోని రాజ్‌భవన్‌కు లోక్‌భవన్‌గా పేరు మర్చారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల్లోని గవర్నర్ల అధికారిక నివాసాల పేర్లను మారుస్తున్న సంగతి తెలిసిందే. ఇదివరకు గవర్నర్ల అధికారిక నివాసాల పేర్లు 'రాజ్ భవన్' గా ఉండగా.. వాటిని 'లోక్ భవన్' గా మార్చింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర హోంమంత్రిత్వశాఖ సమాచారం మేరకు రాజ్‌భవన్ పేరు మార్పు చేశారు. రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మార్చడానికి ఏపీ గవర్నర్ గవర్నర్ ఆమోదం తెలిపారు. పేరు మార్చడానికి గవర్నర్ ఆమోదంతో నోటిఫికేషన్ విడుదలైంది.

కాగా, కేంద్ర ఆదేశాల మేరకు రాజ్‌భవన్, రాజ్ నివాస్‌ల పేర్లను లోక్‌భవన్, లోక్‌నివాస్‌లుగా మార్పులు చేస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గుజరాత్, అస్సాం, కేరళ, త్రిపుర, ఒడిశా రాష్ట్రాల రాజ్‌భవన్‌లను లోక్‌భవన్‌లుగా మార్చారు. ఆ జాబితాలో ఏపీ కూడా చేరింది.

## నిద్రపోతున్న చిన్నారులను కాటేసిన పాము.. తమ్ముడు మృతి, అన్నకు సీరియస్



ఏపీ న్యూస్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): ఏపీలో విషాద ఘటన చోటు చేసుకుంది. నిద్రిస్తున్న చిన్నారులను పాము కాటు వేయడంతో తమ్ముడు మృతి చెందగా.. అన్న పరిస్థితి సీరియస్ గా ఉంది. పోలీసుల వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కండ్లగూడూరులో మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న ఇద్దరు అన్నదమ్ములను పాము కాటు వేసింది. నొప్పితో విలవిలలాడుతున్న పిల్లలను ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే చిన్న కుమారుడైన శివనారాయణ మృతి చెందాడు. అన్న శివరామరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు కుమారుల్లో ఒకరిని కోల్పోవడం, మరొకరి పరిస్థితి సీరియస్ గా ఉండటంతో తల్లిదండ్రుల పరిస్థితి హృదయ విదారకంగా మారింది. కాగా ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

## విజయవాడలో 'హైడ్రా' తరహాలో కూల్చివేతలు! భవానీపురంలో 42 నిర్మాణాలపై బుల్డోజర్లు



ఏపీ న్యూస్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): విజయవాడలో 'హైడ్రా' తరహాలో అధికారులు పలు నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. భవానీపురంలోని బోగినగర్ ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య బుధవారం ఉదయం నుంచి కూల్చివేతలు కొనసాగుతున్నాయి. లక్ష్మీ రామ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ భూవివాదంపై కోర్టు తాజాగా సొసైటీకి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో, అధికార యంత్రాంగం బుల్డోజర్లతో అక్రమ నిర్మాణాలను తొలగిస్తోంది. సొసైటీకి చెందిన భూములను కొందరు దళారులు నకిలీ/దొంగ రిజిస్ట్రేషన్లతో మూడో వ్యక్తులకు విక్రయించినట్లు విచారణలో స్పష్టమైంది. ఆ భూముల్లో పలువురు ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లను నిర్మించుకున్నారు. 25 ఏళ్లుగా నివసిస్తున్నామని బాధితులు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు అధికారులు 42 నిర్మాణాలను కూల్చివేయడంతో ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది.

కూల్చివేతలను అడ్డుకునేందుకు స్థానికులు ప్రయత్నించగా, పోలీసులు వారికి అడ్డుపడ్డారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తమ జీవితభారాన్ని కోల్పోయామని బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆకస్మిక కూల్చివేతల కారణంగా రోడ్డున పడ్డామని, తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

## తెలంగాణపై పవన్ కళ్యాణ్ కామెంట్స్... వైఎస్ షర్మిల సంచలన ట్వీట్



ఏపీ న్యూస్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): తెలంగాణపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన కామెంట్స్ దుమారం రేపుతున్నాయి.. ఆయన చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌంటర్ ఇస్తున్నారు. ఇక తాజాగా ఈ వివాదంపై వైఎస్ షర్మిల సంచలన ట్వీట్ చేశారు. కోనసీమ కొబ్బరికి తెలంగాణ ప్రజల దిష్టి తగిలిందంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడటం బాధాకరం అంటూ పోస్ట్ పెట్టారు. ఇలాంటి మాటలు ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చ గొట్టడమే అంటూ నిప్పులు చెరిగారు. ఇది పవన్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అని మండిపడ్డారు. వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు షర్మిల.

అన్నదమ్ముల్లాంటి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య మళ్ళీ ప్రాంతీయ విద్వేషాలను నింపొద్దని కోరారు. సముద్రం నుంచి పైకొస్తున్న ఉప్పు నీళ్లతో లక్షల సంఖ్యలో చెట్లు కూలిపోతే, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని ప్రభుత్వ వైఫల్యాన్ని దిష్టి మీద రుద్దడం సరికాదని చురకలు అంటించారు. మూఢ నమ్మకాలను అడ్డంపెట్టుకుని ప్రజలను కించపరచడం ఉప ముఖ్యమంత్రిగా మీకు సబబు కాదని ఆగ్రహించారు. కోనసీమ కొబ్బరిచెట్టుపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఉప్పునీటి ముప్పును తప్పించండని కోరారు. కొబ్బరి రైతుల కష్టాలకు తక్షణ పరిష్కారం చూపండని డిమాండ్ చేశారు. రూ.3500 కోట్లు వెంటనే కేటాయించి పనులు మొదలు పెట్టండన్నారు షర్మిల.

## బీజాపూర్ లో ఎన్కౌంటర్.. ఏడుగురు మావోయిస్టులు, ఇద్దరు జవాన్లు మృతి



ఏపీ న్యూస్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): మావోయిస్టు పార్టీ అగ్ర నేతల వరుస లొంగుబాట్ల నేపథ్యంలో మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ-బీజాపూర్ సరిహద్దులో భద్రతాదళాలు, మావోయిస్టుల మధ్య బుధవారం ఉదయం నుంచి ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎదురు కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు, ఇద్దరు జవాన్లు మృతి చెందినట్టు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. ఘటనా స్థలంలో భారీ పెద్ద ఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కాగా మరణించిన మావోయిస్టుల వివరాలు తెలియాల్సి ఉంది. గత కొంతకాలంగా మావోయిస్టు పార్టీ లొంగుబాట్లు, ఎంకౌంటర్లతో అతలాకుతలం అవుతున్న సంగతి తెలిసిందే. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు 2026 ఆగస్టు 31 నాటికి దేశాన్ని మావోయిస్టు రహిత భారత్ గా మార్చేందుకు ఆపరేషన్ కగర్ చేపట్టిన సంగతి తెలిసిందే.

## 50 శాతం సేంద్రీయ వ్యవసాయం పెంచేందుకు కృషి చేయాలి



ఏపీ న్యూస్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): రాష్ట్రంలోని రైతులు వచ్చే ఏడాది నాటికి 50 శాతం సేంద్రీయ వ్యవసాయం పెంచేందుకు కృషి చేయాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అన్నదాతల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం తలపెట్టిన రైతన్నా మీ కోసం పేరుతో జరుగుతున్న రైతు వారోత్సవాల్లో భాగంగా పాయకరావుపేట నియోజకవర్గం ఎస్.రాయవరం మండలం గుడివాడ గ్రామంలో రైతులో ముఖాముఖిని మంత్రి బుధవారం నిర్వహించారు. పర్యటనలో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ ను పరిశీలించారు. వాటిని ఏర్పాటు చేసిన రైతులతో మాట్లాడి స్టాల్స్ గురించిన వివరాలు, ఉత్పత్తుల ప్రత్యేకతను గురించి తెలుసుకున్నారు. . ఈ సందర్భంగా రైతులు, అధికారులు హోం మంత్రిని ఘనంగా సన్మానించారు. అనంతరం రైతులతో జరిగిన ముఖాముఖిలో అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరమైన పరిష్కారాలతో పాటు వివిధ అంశాలపై చర్చించారు. సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

రైతులు దేశానికి వెన్నుముకని మంత్రి అనిత పేర్కొన్నారు. రైతులకు తాము ఉన్నామనే భరోసా ఇవ్వాలని నాయకులు, అధికారులకు సూచించారు. ఎన్డీయే ప్రభుత్వం రైతులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, అందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పంట ఉత్పత్తికి గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రైతులకు చెప్పారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా, కేవలం 24 గంటల్లో రైతుల ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తున్నామని వెల్లడించారు. నియోజకవర్గంలోని తమలపాకుల రైతులకు అధికంగా నష్టపరిహారం అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు.

## మాజీ మంత్రి కాకాణిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫిర్యాదు




వైసీపీ నాయకుడు.. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిపై సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తన ఫిర్యాదును నెల్లూరు రూరల్ పోలీసు స్టేషనులో అందజేశారు. తాను కోట్ల రూపాయలను దోచుకున్నానని కాకాణి నిరాధార ఆరోపణలు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. గుడిని బాగు చేస్తే తనను తప్పుబట్టిన ఘనత మాజీ మంత్రి కాకాణికే దక్కుతుందని అన్నారు. 14.5 ఎకరాలను బడులు, ఆసుపత్రులకు ఇచ్చిన చరిత్ర తమదని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. అత్తగారి భూముల పేరుతో పక్క భూములు ఆక్రమించుకున్న చరిత్ర కాకాణిది అని ఆరోపణలను గుప్పించారు. కాకాణి కండిషన్ బెయిల్ పై ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. పద్ధతి మార్చుకోకపోతే కాకాణి, అతని అనుచరులు జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

సోమిరెడ్డిపై కాకాణి ఆరోపణలు

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై ఇటీవల పలు ఆరోపణలను చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆలయ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని పరిరక్షించాలని అన్నారు. ఈ మేరకు గత నవంబరులో ఎమ్మెల్యే సోమిరెడ్డిపై ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనరుకు ఫిర్యాదు చేశారు. కాకుటూరులో దేవుడి భూమిని ఆక్రమించారంటూ ఎమ్మెల్యేపై ఆరోపణలను గుప్పించారు. దేవుని భూమిని రక్షించకపోతే తాను న్యాయ పోరాటం చేస్తానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇరువురు పరస్పర ఫిర్యాదులతో రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించారు.

## కేఎల్ యూనివర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య కలకలం



ఏపీ న్యూస్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): కేఎల్ యూనివర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య కలకలం రేగింది. ఏపీలోని వడ్డేశ్వరం వద్ద యూనివర్సిటీలో ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న సురేష్ రెడ్డి అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే పోలీసులు రాకముందే డెడ్ బాడీని తరలించే ప్రయత్నం చేశారు. దీనిని అక్కడే ఉన్న విద్యార్థులు వీడియో తీశారు. పోలీసులు రాకముందే విద్యార్థి డెడ్ బాడీ తరలించారని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాలు యూనివర్సిటీ ఎదుట ఆందోళనకు దిగాయి.

వీసీ, డీన్, రిజిస్ట్రార్ సరిగ్గా స్పందించకపోవడంతో కాంచనగంగా హాస్టల్ వద్ద విద్యార్థులు ధర్నాకు దిగారు. సురేష్ మృతిపై తక్షణమే విచారణ జరిపి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీంతో యూనివర్సిటీ దగ్గర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయితే విద్యార్థి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు అనే వివరాలు ఇంకా తెలియలేదు. చదువు ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడా లేదంటే పర్సనల్ కారణాల వల్ల చేసుకున్నాడా అనేది తేలాల్సింది.

# అంగన్వాడిలో విష ఆహారం తిని చిన్నారి మృతి

## మరో ముగ్గురికి తీవ్ర అస్వస్థత
## ఇటుకల గడ్డ తండాలో కన్నీళ్ల పర్యంతం
## ఐసీడీఎస్ నిర్లక్షంపై గిరిజనుల మండిపాటు





మరిపెడ, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): అంగన్ వాడీ సెంటర్ ల పని తీరు అధ్వాన్నంగా మారింది. ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణ లోపం సిబ్బంది నిర్లక్ష వైఖరి చిన్నారుల పాలిట శాపంగా మారింది. డోర్నకల్ నియోజవర్గం లోని మరిపెడ మండలం ఇటుకల పాడు తండా లోని అంగన్ వాడీ సెంటర్ లో ఆడుతూ పడుతూ తల్లి ఒడి నుండి అంగన్ వాడీ సెంటర్ కు వెళ్లిన చిన్నారి భూక్య చైత్ర (4) గత నెల 14న వెళ్లగా వారికి సెంటర్ లో పెట్టిన వడియాలు తినటం తో కాసేపట్లో వంతులతో పాటు తీవ్ర అస్వస్థ తకు గురైంది. చైత్ర తో పాటు మూడేళ్ల వయసు ఉన్న నిత్య , కీర్తిలు అనారోగ్యానికి గురై య్యారు . చైత్ర పరిస్థితి విషమంగా మారటంతో ఖమ్మం నుండి హైదరాబాద్ నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చైత్ర మృతి చెందినట్లు తల్లి దండ్రులు భూక్య రవీందర్ రేణుక దంపతులు కన్నీళ్ల పర్యంతం చెందుతూ తెలిపారు. ఒకరు కాదు ఇద్దరు కాదు ఇంతమంది కలుషితమైన ఆహారం తిని అస్వస్థత కు గురికావటంతో గిరిజన తండాలో విషాదం అలుముకుంది. అక్షరజ్ఞానం నేర్పి పౌష్టిక ఆహారం పెడతారు అనుకుంటేనిండు ప్రాణం బలి తీసుకున్నారని కన్నీళ్ల పర్యంతం అయ్యారు.. గిరిజన నియోజవర్గం గిరిజనులే పాలకులుగా ఉన్నప్పటికీ గిరిజన తండాల పై నెలకొన్న దుర్భర దుస్థితి కి అద్దం పడుతుంది.




# ఎమ్మెల్యే అనుచరుడు వైన్ షాప్ కోసం రోడ్డుపై షేడ్స్ అక్రమ నిర్మాణాలు

## ఆకుల సతీష్, నల్ల జై శంకర్ గౌడ్

కుత్బుల్లాపూర్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): దుండిగల్ మెయిన్ రోడ్, కైసర్ నగర్ వెళ్లే రహదారి వద్ద ఉన్న సర్వే నంబర్లు 350, 351 ప్రాంతంలో ఆక్సిజన్ హెూమ్స్ అపార్ట్మెంట్ సెట్‌బ్యాక్ ప్రాంతంలో ఎలాంటి మున్సిపల్ / హెచ్ఎండిఏ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. అపార్ట్మెంట్‌కు కేటాయించిన సెట్‌బ్యాక్ స్థలం, ఫుట్‌పాత్ కైసర్ నగర్ రోడ్ బఫర్ జోన్‌ను ఆక్రమించి దాదాపు 12 పెద్ద షెడ్లను నిర్మించడం జరిగింది. ఈ నిర్మాణాలు బాచుపల్లి నుండి దుండిగల్ వైపు, దుండిగల్ నుండి కైసర్ నగర్ వైపు వచ్చే వాహనాలకు జంక్షన్ వద్దనే భారీ ట్రాఫిక్ సమస్యలు సృష్టించే అవకాశం ఉంది. అదే విధంగా ఈ అక్రమ షెడ్లలో "లిక్కర్ మార్ట్" అనే వైన్ షాప్‌ను ఏర్పాటు చేయడం వల్ల: ఉదయం, సాయంత్రం సమయంలో హైవే కైసర్ నగర్ వైపు వచ్చే ప్రజలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రహదారిపైనే వాహనాలు పార్క్ చేస్తున్నాయి తీవ్ర ట్రాఫిక్ జామ్‌కు, ప్రమాదాలకు ప్రజా భద్రతకు ముప్పుకు దారితీస్తోంది. ముఖ్యంగా ఆక్సిజన్ హెూమ్స్ వెస్ట్ సైడ్ ఎంట్రన్స్ వైపు చూపించిన 10 మీటర్ల సెట్‌బ్యాక్ ప్రాంతంలో కూడా ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భారీ షెడ్ల నిర్మాణం జరగడం పూర్తిగా జిహెచ్ఎంసి బిల్డింగ్ బై-లాస్‌కు విరుద్ధం. ఇంత పెద్ద స్థాయిలో 12 షెడ్లను అక్రమంగా నిర్మిస్తున్నా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఎవరి సహకారంతో ఇవి సాగుతున్నాయి?



**మా డిమాండ్లు:** ఆక్సిజన్ హెూమ్స్ సెట్‌బ్యాక్ స్థలంలో అక్రమంగా నిర్మించిన 12 భారీ షెడ్లు వెంటనే కూల్చివేయాలి. ఫుట్‌పాత్, రోడ్డుకు సంబంధించిన బఫర్ జోన్ ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగేలా సహకరించిన టౌన్ ప్లానింగ్ అధికారులపై కూడా కఠినమైన చర్యలు తీసుకోవాలి. అక్రమ షెడ్లలో ఏర్పాటు చేసిన లిక్కర్ మార్ట్ వైన్ షాప్ అక్రమ నిర్మాణాలపై వారం కిందట ఫిర్యాదు చేసిన మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడానికి కారణం ఎమ్మెల్యే వివేక్ అనుచరుడు వ్యాస్ గౌడ్ కు సంబంధించిన లిక్కర్ షాప్ కావడమే వల్లనే అధికారులు చర్యలు తీసుకోలేదని,తక్షణమే అక్రమ షాపుల నిర్మాణంపై, సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలి.


To,
The Deputy Commissioner
Gajula Ramaram circle -GHMC
Hyderabad, Telangana

1/12/25

Respected sir

(Akula Satish)
Plot no 20, Hari Shree avenues, Srinivas Nagar, NizamPet

INWARD

ఈ కార్యక్రమంలో నల్ల జై శంకర్ గౌడ్,పున్నారెడ్డి, పులి బలరాం, చందు, శ్యామ్, దేవర రమేష్, అరుణ్ రావు, రాము, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

# అల్వాల గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించండి

## సర్పంచ్ అభ్యర్థి యం.రాజా మహేందర్ రెడ్డి





వనపర్తి, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): అల్వాల గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నేను యం.రాజా మహేందర్ రెడ్డి ని నామినేషను వేశాను.నా గుర్తు ఉంగరం గుర్తు గ్రామంలో ఉన్నటువంటి ఓటర్లు అందరూ ఆశీర్వదించి మీ అమూల్యమైన ఓటును వేసి గెలిపిచలని గ్రామంలో ఉన్న అభివృద్ధి పనులకు పని చేస్తానని వారు తెలిపారు.

# మణిగిల్ల ఒకటో వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన దారం శైలజ మహేష్ యాదవ్ ఏకగ్రీవం

వనపర్తి, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): మణిగిల్ల గ్రామ పంచాయతీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒకటవ వార్డ్ మెంబర్గా బలపరిచిన దారం శైలజ మహేష్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.వారు మాట్లాడుతూ..నన్ను ఎనుకున్న వార్డు ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వార్డు సంబంధించిన అభివృద్ధి పనులకై ఎల్లవేళలా పనిచేస్తానని అన్నారు.



# ఘనంగా జిల్లా, స్థాయి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమం




సూర్యాపేట, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): అంతర్జాతీయ దివ్యాంగుల, దినోత్సవం 2025 జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహ రావు, అధ్యక్షతన డిసంబర్ 03 బుధవారం ఉదయం 11.00 గంటలకు జిల్లా స్థాయి, అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం 2025 వేడుక కార్యక్రమానికి జిల్లా అదనపు ఎ.స్పి రవీందర్ రెడ్డి , పి.డి మెప్మా, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి ముఖ్య అతిధి గా హాజరు అయిన్నారు.జిల్లా సంక్షేమ అధికారి, మాట్లాడుతూ జిల్లా లో ఉన్న దివ్యాంగుల, అందరికి ప్రభుత్వం నుండి అన్ని విధాల తమ సమస్య లు పరిష్కరిస్తాం. అని అన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016 పై అవగాహన సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. ,జిల్లా అదనపు ఎ.స్పి మాట్లాడుతూ, జిల్లా లో ఉన్న ప్రతి పోలీస్ అధికారులు, దివ్యాంగుల సమస్య లను తప్పకుండా ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరిస్తాం అని అన్నారు. మరియు ప్రతి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయటం కోసం వచ్చిన దివ్యాంగుల కు ప్రత్యేకంగా వారి వాహనాలు (స్కూటీ) అనుమతి ఇస్తాం అన్నారు. పి.డి మెప్మా, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల ఎస్.హెచ్.జి సంఘాలు ఏర్పాటు చేస్తాం అని, వారికీ ఋణాలు మంజూరి బ్యాంకర్స్ ద్వారా కల్పిస్తాం అన్నారు.జిల్లా వైద్యధికారి వెంకట రమణ మాట్లాడుతూ జిల్లా లోని ప్రతి ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో దివ్యాంగుల కోసం వీల్ చైర్స్, ర్యాంప్ ఏర్పాటు చేసాము అని వారికీ వైద్య సేవలు అందిస్తున్నాం అన్నారు మరియు ఇంకా ఎటువంటి ఆరోగ్య సమస్యలు, ఉన్న వారికీ ప్రత్యేక ట్రీట్మెంట్ అందించుతాం అన్నారు. అనంతరం జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో దివ్యాంగుల కు ఏర్పాటు చేసిన ఆటల పోటిలలో గెలుపొందిన విజేతలకు అపూర్వ బదిరుల స్కూల్, చెవిటి,మూగ విద్యార్థులకు గెలుపొందిన, దివ్యాంగులకు బహుమతులను, జిల్లా అధికారులు అందించారు.ఈ కార్యక్రమం లో డి.సి.హెచ్. ఎస్ డ్రా. వెంకటేశ్వర్లు,ఎల్ ఎండీ నాగ ప్రసాద్, డి.ఆర్. డి.ఏ డీపీం బెనర్జీ ,టౌన్ సి.ఐ ,మధన చారి, జిల్లా లోని దివ్యాంగ విద్యార్థులు , దివ్యాంగులు మరియు వారి యొక్క సంక్షేమ సంఘాల అధ్యక్షులు,నాయకులు,దివ్యాంగుల కోసం పని చేసే స్వచ్ఛంద సంస్థలు తదితరులు పాల్గొన్నారు.

# శబరిమల వెళ్లే భక్తులకి శుభవార్త



తొర్రుర్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): శబరిమలై వెళ్ళు అయ్యప్ప స్వాములకు బస్సు సౌకర్యం ఈనెల 17వ తారీఖున తొర్రూర్ డిపో నుండి శబరిమలైకి బస్సు బయలుదేరును ఈ బస్సులో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయి శబరిమలై వెళ్ళు అయ్యప్ప స్వాములు ప్రయాణించటకు ఎనిమిది వేల రూపాయలు టికెట్ 7 రోజుల ప్రయాణ సౌకర్యం కలదు అయ్యప్ప స్వాములు వెళు ళ్ళ పుణ్యక్షేత్రములు శ్రీశైలం మహానంది అహెూబిలం పలా ని గురువాయర్ అయ్యప్ప సన్నిధానం త్రివేంద్రం రామేశ్వరం మధురై శ్రీరంగం అరుణాచలం శ్రీ కాళహస్తి తొర్రూర్ శబరి యాత్ర చేయు అయ్యప్ప స్వాములు డిపో నందు సంప్రదించగలరు. సద్వినియోగ చేసుకోగలరని కోరుచున్నాము. ఇట్టి ప్రయాణంలో సివిల్ స్వాములు కూడా వెళ్లి అయ్యప్పను దర్శించుకో దర్శించుకొనుటకు అవకాశం కలదు. వెళ్ళు అయ్యప్ప భక్తులు మా తొర్రూరు డిపో నందు సంప్రదించగలరు. సంప్రదించవలసిన నంబర్స్ 7032182456, 9963991518, 9959226053.

# నరసింహులపేట గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

## బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి శివకుమార్



నరసింహుల పేట , 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): చెప్పిందే చేయడం.. చేసేదే చెప్పడం ఆయన నైజం. అతడు మీ ప్రశ్నకి సమాధానం..మీ సమస్యకి పరిష్కారం నిత్యం ప్రజలలో మమేకం అయిప్రజాసమస్యలే తన సమస్యలుగా భావిస్తూ... ప్రజాసేవే తన మతంగా.. ప్రజాశ్రేయస్సే తన అభిమతంగాఎల్లవేళలా నిత్యం తోడు నీడ గా మెలుగుతూ.జనంతో మమేకం అవుతూఅవిశ్రాంత శ్రామికుడివలే శ్రమిస్తున్న యువ నేత.రాజకీయాల్లో యువత కి ఆదర్శంగా ఉంటూ.యువ కెరటం మై ఎగిసిపడుతున్న.యువ నాయకుడు, నరసింహుల పేట టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సర్పంచ్ పోటీ చేస్తున్న నకరికంటి శివకుమార్ గ్రామ ప్రజలు యువత రాజకీయాల్లోకి రావాలి.ఈ యువ నాయకుడిని ఆదరించి ఆశీర్వదించి. మీ అమూల్యమైన ఓటు వేసి పిలిపించాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు మండల నాయకులు గ్రామ ప్రజలను కోరుతున్నారు

# బత్తుల జంపన్న కుటుంబాన్ని పరామర్శించిన చల్లా కృష్ణ



ఖమ్మం/దానవాయిగూడెం, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): పాలేరు నియోజకవర్గ పరిధిలోని, 59 డివిజన్ దానవాయిగూడెం కాలనీ కి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన, బత్తుల జంపన్న ఇటీవల కాలంలో అకస్మాత్తుగా మరణించారు. విషయం తెలుసుకున్న రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు తుంబురు దయాకర్ రెడ్డి సలహామేరకు, స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లా కృష్ణన్న మృతుల కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి మనోధైర్యం ను నింపారు. దశదిన కార్యక్రమానికి, తమ వంతు సహాయంగా చల్లా కృష్ణన్న 5,000/ రూపాయలు కుటుంబసభ్యులకు అందజేశారు. వారి కుటుంబానికిఎల్లపుడూ, కాంగ్రెస్ పార్టీ తరుపున అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చల్లా కృష్ణ టీమ్ పాల్గొనడం జరిగింది.

# పుట్టినరోజు సందర్బంగా మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలసిన కోటేశ్వరరావు



కుత్బుల్లాపూర్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): ఘనంగా చెన్నం శెట్టి కోటేశ్వరరావు, నియోజవర్గం కాపు సేవా సమితి విఎంఆర్ కుత్బుల్లాపూర్ నియోజవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నం శెట్టి కోటేశ్వరరావు ఎమ్మెల్యే వివేకనంద ని కలసి శాలువతో సత్కరించారు ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ఈ కార్యక్రమంలోకోరుకుంటున్నాను అని అన్నారు ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు బీరప్ప నగర్ వెల్ఫర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వోత్తమ్, వేణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరిన కందగట్ల బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు.




సూర్యాపేట/ఆత్మకూర్(ఎస్), 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): మండలంలోని కందగట్ల గ్రామానికి చెందిన 50 మంది బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి, ఏ.ఐ.సీ.సీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి, పలువురు కాంగ్రెస్ పార్టీలో, చేరుతున్నారని అన్నారు.కందగట్ల గ్రామ కాంగ్రెస్ అభ్యర్థి శిగ శ్రీను ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# మన శరీరంలో మంచి కొలెస్ట్రాల్ కూడా ఉంటుందని మీకు తెలుసా..?

## అది పెరగాలంటే ఏం చేయాలి..?

హెల్త్ న్యూస్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): మన శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉంటే ప్రమాదం అన్న విషయం అందరికీ తెలిసిందే. దీని వల్ల హార్ట్ ఎటాక్ సంభవిస్తుందనే విషయం ప్రతి ఒక్కరికీ తెలుసు. కనుకనే శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎల్లప్పుడూ తక్కువగా ఉండాలని వైద్యులు సూచిస్తుంటారు. అయితే కొలెస్ట్రాల్ అనగానే ఒక్కటే అనుకుంటారు. కానీ ఇందులో రెండు రకాలు ఉంటాయి. ఒకటి మన శరీరానికి చెడు చేస్తుంది. దీన్నే ఎల్‌డీఎల్ లేదా చెడు కొలెస్ట్రాల్ అంటారు. ఇంకొక కొలెస్ట్రాల్ మనకు మేలు చేస్తుంది. దీన్నే హెచ్‌డీఎల్ లేదా మంచి కొలెస్ట్రాల్ అంటారు. అయితే శరీరంలో ఎల్‌డీఎల్ స్థాయిలు తక్కువగా, హెచ్‌డీఎల్ స్థాయిలు ఎక్కువగా ఉండాలి. అప్పుడే కొలెస్ట్రాల్ స్థాయిలు ఎల్లప్పుడూ నియంత్రణలో ఉంటాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. కానీ ప్రస్తుతం చాలా మందిలో ఎల్‌డీఎల్ అధికంగా ఉంటోంది. దీని వల్ల గుండె జబ్బుల బారిన పడుతున్నారు. కనుక గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఎల్‌డీఎల్‌ను తగ్గించుకోవాల్సి ఉంటుంది. దీనికి గాను హెచ్‌డీఎల్‌ను పెంచాల్సి ఉంటుంది. ఇక ఇందుకు పలు రకాల ఆహారాలు మనకు దోహదం చేస్తాయి.




బీన్స్, పప్పు దినుసులు, గింజలు..

శరీరంలో హెచ్‌డీఎల్ స్థాయిలను పెంచుకునేందుకు అనేక ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా రోజూ బీన్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలి. గ్రీన్ బీన్స్‌తోపాటు రాజ్మా, బ్లాక్ బీన్స్, సోయా బీన్స్ ను తరచూ తింటుండాలి. ఇవి హెచ్‌డీఎల్‌ను పెంచుతాయి. ఎల్‌డీఎల్‌ను తగ్గిస్తాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే శనగలు, పెసలు వంటి పప్పు దినుసులను సైతం తరచూ తింటున్నా కూడా హెచ్‌డీఎల్ పెరుగుతుంది. వీటిల్లో ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి హెచ్‌డీఎల్ స్థాయిలను పెరిగేలా చేస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయం చేస్తాయి. కనుక వీటిని తరచూ తినాలి. అలాగే వాల్ నట్స్, బాదంపప్పు, జీడిపప్పును తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. వీటిల్లో ఉండే ఫోలిక్ యాసిడ్, మెగ్నిషియం, ఐరన్, ఆరోగ్యకరమైన కొవ్వులు హెచ్‌డీఎల్ స్థాయిలను పెంచడంలో సహాయం చేస్తాయి. దీని వల్ల గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది.

విత్తనాలు, అవకాడో..

అవిసె గింజలు, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, చియా సీడ్స్‌లో మెగ్నిషియం, విటమిన్ ఇ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి గుండెను సురక్షితంగా ఉంచుతాయి. శరీరంలో హెచ్‌డీఎల్ లెవల్స్ పెరిగేలా చేస్తాయి. దీని వల్ల హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. అలాగే అవకాడోలను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటున్నా ఉపయోగం ఉంటుంది. ఈ పండ్లను తింటే రక్త నాళాల వాపులు తగ్గుతాయి. అలాగే హెచ్‌డీఎల్ లెవల్స్ పెరిగి ఎల్‌డీఎల్ లెవల్స్ తగ్గుతాయి. వీటిల్లో ఉండే మెగ్నిషియం కండరాల వాపులను తగ్గిస్తుంది. ఈ పండ్లలోని పొటాషియం రక్త సరఫరా మెరుగు పడేలా చేస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. కనుక అవకాడోలను తరచూ తింటుంటే గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

ఇవి కూడా అవసరమే..

ఇక శరీరంలో హెచ్‌డీఎల్ లెవల్స్ పెరగాలంటే అందుకు మనం సరైన జీవనశైలిని కూడా పాటించాల్సి ఉంటుంది. రాత్రి పూట త్వరగా భోజనం చేయాలి. తేలిగ్గా జీర్ణం అయ్యే ఆహారాలను తినాలి. నూనె పదార్థాలు, బేకరీ ఐటమ్స్, జంక్ ఫుడ్‌ను తినకూడదు. మరీ అతిగా తినకూడదు. రాత్రిపూట త్వరగా నిద్రించి ఉదయం త్వరగా నిద్రలేవాలి. రోజూ కనీసం 30 నిమిషాల పాటు శారీరక శ్రమ లేదా వ్యాయామం చేయాలి. వేళకు భోజనం చేయాలి. అన్ని రకాల పోషకాలు ఉండే ఆహారాలను తినాలి. చక్కెర, ఉప్పు వాడకం తగ్గించాలి. మద్యం సేవించడం తగ్గించాలి లేదా మానేయాలి. పొగ తాగడం మానేయాలి. ఒత్తిడి, ఆందోళనను తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. ఇవన్నీ కూడా హెచ్‌డీఎల్ స్థాయిలు పెరిగేందుకు దోహదం చేస్తాయి. ఇలా ఆయా ఆహారాలను తింటూ సరైన జీవనశైలిని పాటిస్తుంటే హెచ్‌డీఎల్ లెవల్స్‌ను పెంచుకోవచ్చు. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ ల బారిన

# మీ పిల్లలకు ఈ ఆహారాలను రోజూ పెట్టండి..

## ఇవి బ్రెయిన్ ఫుడ్స్.. వారి తెలివితేటలను పెంచుతాయి..!

హెల్త్ న్యూస్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ ఎంతటి తీవ్రమైన పోటీ నెలకొందో అందరికీ తెలిసిన విషయమే. ముఖ్యంగా విద్య, ఉద్యోగ రంగాల్లో కొన్ని కోట్ల మంది ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో ఈ పోటీ ప్రపంచంలో నెగ్గాలంటే ప్రతి ఒక్కరికి అద్భుతమైన నైపుణ్యాలు ఉండాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. స్కిల్స్ ఉంటే కానీ ఈ పోటీ ప్రపంచంలో నెట్టుకు రాలేకపోతున్నారు. అయితే ఒక మనిషికి స్కిల్స్ ఉండాలంటే అప్పటికప్పుడు అభివృద్ధి చెందడం కష్టం. వాటిని చిన్నప్పటి నుంచే వృద్ధి చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఈ విషయంలో తల్లిదండ్రులు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుంది. తల్లిదండ్రులు తమ పిల్లలు పెద్దయ్యాక ఎలాంటి స్కిల్‌ను అయినా సులభంగా నేర్చుకోవాలన్నా, అందరిలోనూ సులభంగా నెగ్గాలన్నా వారికి తెలివితేటలు వృద్ధి చెందేలా చూడాలి. అందుకు గాను పలు ఆహారాలు ఎంతో దోహదం చేస్తాయి. పిల్లలకు తల్లిదండ్రులు ఆ వయస్సు నుంచే రోజూ పలు ఆహారాలను పెడుతుండాలి. దీని వల్ల వారిలో మెదడు పనితీరు మెరుగు పడుతుంది. జ్ఞాపకశక్తి వృద్ధి చెంది తెలివితేటలు పెరుగుతాయి. చదువుల్లో రాణిస్తారు. పెద్దయ్యాక కూడా అన్నింట్లోనూ, అందరికన్నా ముందే ఉంటారు.

చేపలు, కోడిగుడ్లు..

పిల్లల మెదడు అభివృద్ధి చెందేలా చూడడంలో చేపలు ఎంతో దోహదం చేస్తాయి. చేపలను వారికి తరచూ పెట్టడం వల్ల వారి మెదడు వికసిస్తుంది. తెలివితేటలు వృద్ధి చెందుతాయి. పిల్లల మెదడుకు పదును పెట్టేందుకు చేపలు ఎంతగానో దోహదం చేస్తాయి. ముఖ్యంగా మంచినీటి లేదా సముద్రపు చేపలను వారికి తినిపించాలి. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి పిల్లల మెదడు పనితీరును మెరుగు పరచడంలో ఎంతో సహాయం చేస్తాయి. దీని వల్ల వారి మెదడు యాక్టివ్‌గా మారి ఉత్సాహంగా ఉంటారు. అన్నింట్లోనూ తెలివితేటలను కనబరుస్తారు. అలాగే పెద్దయ్యాక కూడా మిక్కిలి ప్రతిభావంతులుగా





మారుతారు. ఇక పిల్లల తెలివితేటలు పెరగాలంటే వారికి రోజూ ఒక కోడిగుడ్డును ఉడకబెట్టి తినిపించినా ఎంతో మేలు జరుగుతుంది. కోడిగుడ్లలో అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, కోలిన్, లుటీన్, జింక్ వంటి పోషకాలు గుడ్లలో ఉంటాయి. ఇవి పిల్లల్లో యాక్టివ్‌నెస్‌ను పెంచుతాయి. బద్ధకం పోయేలా చేస్తాయి. దీంతో వారి మెదడు వికసిస్తుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చదువుతోపాటు ఇతర అంశాల్లోనూ రాణిస్తారు. పెద్దయ్యాక ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు.

పెరుగు..

పిల్లల మెదడు అభివృద్ధికి పెరుగు సైతం దోహదం చేస్తుంది. పెరుగును రోజూ వారికి తినిపించాలి. ఇది మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీని వల్ల మెదడుకు అలర్ట్‌నెస్ పెరుగుతుంది. దీంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరిగి చిన్నారులు ఏ విషయాన్నయినా ఇట్టే నేర్చుకుంటారు. అలాగే చిన్నారులకు పాలకూర, అరటికాయలు, బ్రోకలీ, ఆకుకూరలు వంటి వాటిని కూడా పెడుతుండాలి. ముఖ్యంగా టమాటాలు, బ్లూ బెర్రీలు, బ్లాక్ బెర్రీల వంటి వాటిని వారికి తినిపిస్తుండాలి. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి మెదడు కణాలను రక్షిస్తాయి. దీంతో మెదడు యాక్టివ్‌గా మారి వారు చదువుల్లో రాణిస్తారు. ఇక పిల్లల ఆరోగ్యం కోసం తృణ ధాన్యాలను కూడా వారికి ఇవ్వాల్సి ఉంటుంది. ఓట్స్, బ్రౌన్ రైస్, కినోవా వంటి ఆహారాలను పెడుతుంటే వారికి నిరంతరం శక్తి లభిస్తుంది. దీని కారణంగా వారు ఎల్లప్పుడూ యాక్టివ్‌గా ఉంటారు. నీరసం, అలసట రావు. బద్ధకం పోతుంది. వారు అన్నింట్లోనూ చురుగ్గా ఉంటారు. ప్రతిభ కనబరుస్తారు.

విటమిన్ ఇ..

పిల్లల మెదడు ఆరోగ్యానికి విటమిన్ ఇ కూడా దోహదం చేస్తుంది. ఇది ఎక్కువగా బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, పిస్తా, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, చియా సీడ్స్, అవిసె గింజలు వంటి వాటిల్లో లభిస్తుంది. కనుక వీటిని పిల్లలకు పెడుతుంటే ఉపయోగం ఉంటుంది. అయితే వీటిని నేరుగా తినిపించకూడదు. నీటిలో నానబెట్టి తినిపించాలి. లేదంటే ఇవి పిల్లల్లో వికారం, వాంతులను కలగజేసే అవకాశం ఉంటుంది. అయితే న్యూట్రిషనిస్టు లేదా డాక్టర్‌ను కలిసి వీటిని పిల్లలకు తినిపిస్తే మంచిది. ఎందుకంటే కొందరికి పలు ఆహారాల వల్ల అలర్జీలు సంభవించే ప్రమాదం ఉంటుంది. కనుక మీ పిల్లలకు ఎలాంటి ఫుడ్స్ పడతాయి అనే విషయాన్ని తెలుసుకుని ఆ ప్రకారం వారికి ఆహారాలను పెడితే దీంతో వారి మెదడు యాక్టివ్‌గా మారి వారి తెలివితేటలు పెరుగుతాయి. దీని వల్ల వారు అన్నింట్లోనూ రాణిస్తారు.





## రొనాల్డోకు భారీ షాక్.. ట్రంప్ తో భేటీ అనంతరం కోటి మంది ఫాలోవర్స్ మాయం..?






స్పోర్ట్స్ న్యూస్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): ప్రపంచ ప్రఖ్యాత స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో ఎక్స్ వేదికగా ఊహించని షాక్ తగిలింది. గత కొద్ది రోజుల్లోనే ఆయన కోటి మంది ఫాలోవర్లను కోల్పోయాడు. రొనాల్డో ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఏకంగా 10 మిలియన్ల (కోటి) మంది ఫాలోవర్లు తగ్గిపోవడం స్పష్టంగా కనిపించింది. నవంబర్‌లో 115 మిలియన్లుగా ఉన్న ఆయన ఫాలోవర్ల సంఖ్య ప్రస్తుతం 105 మిలియన్లకు తగ్గిపోయింది. దీనికి ప్రధాన కారణం ఫేక్ అకౌంట్లు తొలగించడమే విశ్లేషకులు చెబుతున్నారు. అలాగే నవంబర్ 18న అమెరికా అధ్యక్షుడు, ప్రపంచ వ్యాప్తంగా వివాదస్పంగా మారుతున్న డొనాల్డ్ ట్రంప్ తో రొనాల్డో భేటీ కావడం కూడా తీవ్ర ప్రభావం చూపించినట్లు అంచనా వేస్తున్నారు. ట్రంప్ అంటే ఇష్టం లేని వారికి వారి మీటింగ్ కోపం తెప్పించిందని కూడా సమాచారం ఉంది. అయితే ఏది ఏమైనప్పటికి రోనాల్డో రోజుల వ్యవధిలోనే కోటి మంది ఫాలోవర్లను కోల్పోవడం క్రీడా ప్రపంచంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిపోయింది.

## మరో మైలురాయి దాటిన రోహిత్ శర్మ




స్పోర్ట్స్ న్యూస్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్):బ్యాటర్ రోహిత్ శర్మ ఖాతాలో అరుదైన రికార్డు చేరింది. స్వదేశీ పిచ్‌లపై అంతర్జాతీయ మ్యాచుల్లో 9 వేల పరుగులు స్కోరు చేసిన బ్యాటర్‌గా ఘనత సాధించాడు. ఆ మైలురాయి అందుకున్న నాలుగవ ఇండియన్ బ్యాటర్ అయ్యాడతను. రాయ్‌పూర్‌లో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో వన్డేలో ఆ మైలురాయి చేరుకున్నాడు. ఆ మ్యాచ్‌లో 8 బంతుల్లో 14 రన్స్ చేసి రోహిత్ శర్మ ఔటయ్యాడు. అయితే అన్ని ఫార్మాట్లలో కలిసి స్వదేశీ పిచ్‌పై అంతర్జాతీయ మ్యాచుల్లో 9వేల రన్స్ చేసిన క్రికెటర్లలో రాహుల్ ద్రావిడ్‌ను రోహిత్ శర్మ దాటేశాడు.

అంతర్జాతీయ క్రికెట్ మ్యాచుల్లో ద్రావిడ్ 9004 రన్స్ చేయగా, ఇవాళ ఆ మైలురాయిని అధిగమిస్తూ రోహిత్ శర్మ 9005 రన్స్ చేశాడు. ఆ లిస్టులో సచిన్ టెండూల్కర్ టాప్‌లో ఉన్నాడు. అతను స్వదేశీ పిచ్‌లపై 14192 రన్స్ చేశాడు. రెండో స్థానంలో ఉన్న విరాట్ కోహ్లీ 12373 రన్స్ స్కోరు చేశాడు. 7796 రన్స్ చేసిన సెహ్వాగ్ అయిదో స్థానంలో ఉన్నాడు.

# డిసెంబర్ 7కు మారిన మంధాన పెళ్లి తేదీ.. ఆమె సోదరుడు ఏమన్నాడంటే..?

స్పోర్ట్స్ న్యూస్, 03 డిసెంబర్ (క్రాంతి న్యూస్): భారత క్రికెటర్ స్మృతి మంధాన , బాలీవుడ్ గాయకుడు పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడి వారం రోజులు దాటిపోయింది. మంధాన తండ్రి శ్రీనివాస్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినా కూడా ఆమె పెళ్లి గురించి కొత్త అప్డేట్ రాలేదు. దాంతో.. ప్రేమపక్షులై టీమిండియా స్టార్ – పలాశ్ కొత్త తేదీని ఎప్పుడు ప్రకటిస్తారు? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 7న పెళ్లి వీరి కల్యాణం జరుగనుందనే కథనాలు నెట్టింట ప్రచారమవుతున్నాయి. మరి ఈ వైరల్ వార్తల్లో నిజమెంత? అనేది తెలుసుకునేందుకు కొన్ని మీడియా సంస్థలు మంధాన సోదరుడు శ్రవణ్‌ను సంప్రదించాయి.





పది రోజుల క్రితం ఆగిపోయిన మంధాన, పలాశ్‌ల పెళ్లి తేదీ గురించిన చర్చకు బ్రేక్ పడడం లేదు. ఉన్నారు. వీళ్లు ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు? తదుపరి కొత్త తేదీ ఎప్పుడు చెబుతారు? అనే సందిగ్ధం కొనసాగుతోంది. ఇదిలా ఉంటే.. డిసెంబర్ 7న మంధాన – పలాశ్‌ల కల్యాణం జరుగనుందనే వార్తలు సోషల్ మీడియాను చట్టేస్తున్న వేళ.. ఆమె సోదరడు శ్రవణ్ మాత్రం షాకింగ్ కామెంట్ చేశాడు. ఇంతకూ

అతడు ఏం చెప్పాడంటే..?

'సోషల్ మీడియాలో వస్తున్న వదంతుల గురించి నాకు తెలియదు. ఇప్పటికైతే మంధాన – పలాశ్ వివాహం వాయిదా పడింది. కొత్త తేదీని ఇంకా నిర్ణయించలేదు' అని చెప్పాడు శ్రవణ్. పలాశ్ తల్లి అమిత మాత్రం త్వరలోనే మంధానతో తన కుమారుడి పెళ్లి జరుగుతుందనే నమ్మకంతో ఉంది.

'ప్రస్తుతం పలాశ్, మంధానలు బాధలో ఉన్నారు. నా కుమారుడు నవవధువుగా మంధానను తీసుకొని ఇంటికి రావాలని ఎన్నో కలలు కన్నాడు. నేను వారికి ప్రత్యేకంగా స్వాగతం పలకాలని ప్రణాళికలు వేసుకున్నాను. కానీ అనుకోకుండా పెళ్లి వాయిదా పడింది. అయినా సరే మా ఇరుకుటుంబాల మధ్య అంతా బాగానే ఉంది. త్వరలోనే మంధాన %–% పలాశ్‌ల పెళ్లి జరుగుతుంది' అని అమిత వెల్లడించింది.

తండ్రికి గుండెపోటు

షెడ్యూల్ ప్రకారం నవంబర్ 23న మంధాన, పలాశ్‌ల పెళ్లి జరగాల్సింది. వివాహ క్రతువులో భాగంగా హల్దీ, మెహెందీ, సంగీత్ వేడుకలు సంబురంగా పూర్తయ్యాయి. ఇక కల్యాణ ఘట్టమే తరువాయి అనుకున్నవేళ మంధాన తండ్రికి గుండెపోటు రావడంతో సందడండా ఆవిరైపోయింది. వెంటనే పెళ్లిని వాయిదా వేయాలని మంధాన నిర్ణయం తీసుకుందని ఆమె మేనేజర్ మీడియాకు చెప్పాడు. ఆ తర్వాత పలాశ్ సైతం అసిడిటీ కారణంగా ఆస్పత్రి పాలవ్వడం.. వంటి పరిణామాలు చర్చనీయాంశమయ్యాయి.

కొరియోగ్రాఫర్‌తో అఫైర్ నడిపిన పలాశ్ టీమిండియా వైస్ కెప్టెన్‌ను మోసం చేశాడనే వార్తలూ వైరలయ్యాయి. అయితే.. మీడియాలో ఎంత రచ్చ జరుగుతున్నా ఈ లవ్ జంట మాత్రం స్పందించలేదు. ఇరువురు తమ ఇన్‌స్టాలో మాత్రం దిష్టి కన్ను బొమ్మను చేర్చి.. వదంతులకు చెక్ పెట్టారు. మంధాన తండ్రి శ్రీనివాస్, పలాశ్ కూడా ఆస్పత్రి నుంచి ఇంటికొచ్చేశారు. కానీ.. ఇప్పటివరకూ వీరి కొత్త పెళ్లి తేదీని మాత్రం ఇరుకుటుంబసభ్యులు ప్రకటించలేదు.

# బాలయ్య అభిమానులకు డబుల్ ధమాకా..
# 'అఖండ-3' టైటిల్ లీక్ చేసిన తమన్




గత కొద్ది రోజులుగా ఎక్కడ చూసినా 'అఖండ-2' పేరు మార్మోగిపోతోంది. గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తుండగా.. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రాబోతుంది. సంయుక్త మీనన్ హీరోయిన్‌గా కనిపించనుండగ.. హర్షాలీ మల్హోత్రా బాలయ్య కూతురిగా నటిస్తోంది. తమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా ఘన విజయం సాధించిన 'అఖండ'కు సీక్వెల్‌గా రాబోతుండటంతో ప్రేక్షకుల్లో హైప్ పీక్స్‌లో ఉంది. షూటింగ్ పూర్తి చేసుకున్న 'అఖండ-2' డిసెంబర్ 5న థియేటర్స్‌లో సందడి చేయనుంది. అఖండ సీక్వెల్ కోసం ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌లో మరింత ఉత్సాహం పెంచే ఓ క్రేజీ లీక్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అది కూడా 'అఖండ-3' సంబంధించిన టైటిల్ కావడం విశేషం. గతంలో ఇండియన్ సినిమాలను ఒక ఊపు ఊపిన 'పుష్ప-2' ఫైనల్ వర్క్ జరుగుతుండగా.. మూడో పార్ట్ టైటిల్ లీక్ అయిన విషయం తెలిసిందే.

ఇప్పుడు అదే తరహాలో 'అఖండ' మూడో పార్ట్ టైటిల్‌ను తమన్ లీక్ చేశారని అంతా భావిస్తున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ట్విట్టర్ ద్వారా ఓ పోస్ట్ పెట్టి బాలయ్య అభిమానులు గుడ్ న్యూస్ తెలిపాడు. ఓ పిక్ షేర్ చేయగా.. అందులో బ్యాక్‌గ్రౌండ్‌లో 'జై అఖండ' అనే టైటిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీంతో ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు, బాలయ్య అభిమానులు మూడో పార్ట్‌కు సంబంధించిన టైటిల్‌ను థియేటర్స్‌లో చివరగా వేసి సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నారని చర్చించుకుంటున్నారు. అందుకే తమన్ ఈ విధంగా హింట్ ఇచ్చాడని అంటున్నారు. మరి ఈ లీక్ అయిన టైటిల్ నిజమో కాదా? అనేది 'అఖండ-2'థియేటర్స్‌లో స్పష్టం కానుంది. అయితే ఒకవేళ ఇదే టైటిల్ ఫిక్స్ చేస్తే బాలయ్య అభిమానులకు డబుల్ ట్రీట్ అని చెప్పవచ్చు.

# అక్కినేని అఖిల్ 'లెనిన్' రిలీజ్ డేట్ లాక్..

## ఆ స్పెషల్ డే నాడే అయ్యగారి రాక ఫిక్స్!




అక్కినేని అఖిల్ హీరోగా ఇండస్ట్రీకి వచ్చి చాలా రోజులే అవుతున్నప్పటికీ పెద్దగా హిట్స్ మాత్రం అందుకోలేదు. 'అఖిల్' చిత్రంతో వచ్చిన ఆయన పలు మూవీస్ చేసినప్పటికీ పేరు ప్రఖ్యాతలను మాత్రం అందుకోలేకపోయాడు. మరీ ముఖ్యంగా 'ఏజెంట్' అఖిల్ కెరీర్‌లో బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా నిలిచింది. దీంతో అఖిల్ గత రెండేళ్లుగా సినిమా ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్నారు. మళ్లీ 'లెనిన్' చిత్రంతో రీ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. మురళీకృష్ణ అబ్బూరు దర్శకత్వంలో రాయలసీమ బ్యాగ్ డ్రాప్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది. అయితే ఈ సినిమాలో ముందుగా.. హీరోయిన్‌గా శ్రీలీలను ఎంపిక చేసుకున్నారు. కొన్ని సీన్లు కూడా షూట్ చేసిన మేకర్స్ ఫస్ట్ గ్లింప్స్ కూడా షేర్ చేసి ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచారు. కానీ కొంత భాగం షూటింగ్ పూర్తి అయిన తర్వాత పలు కారణాల వల్ల ఈ సినిమా నుంచి శ్రీలలు తొలగించారని తెలుస్తోంది.

అంతేకాకుండా పలు సీన్స్‌ను రీషూట్ చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇక ఇందులో హీరోయిన్‌గా శ్రీలీల స్థానంలోకి భాగ్యశ్రీ బోర్సేను ఎంపిక చేసుకున్నట్లు టాక్. తాజా.. సమాచారం ప్రకారం.. ఈ సినిమాకు సంబంధించిన రీ షూటింగ్‌తో పాటు.. దాదాపు షూట్ పూర్తి అయినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని 2026 ఫిబ్రవరి 14 వాలెంటైన్స్‌ను పురస్కరించుకుని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా మూవీ మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. త్వరలోనే భాగ్యశ్రీ బోర్సే కూడా ఈ షూట్‌లో పాల్గొనబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. డిసెంబర్ చివరి వరకు షూట్ పూర్తి చేసి జనవరిలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా చేయబోతున్నారని తెలుస్తోంది.

అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌లో రాబోతున్న 'లెనిన్' ఎంత వరకు ప్రేక్షకులను మెప్పిస్తుందో చూడాలి. ఇక ఫిబ్రవరి 14వ తేదీన విడుదల కానున్న ఈ సినిమాకు పోటీగా 'స్వయంభు' కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ వాలెంటైన్స్ డేకి అఖిల్, నిఖిల్ మధ్య గట్టి పోటీ ఉండబోతుందని తెలుస్తోంది. కాగా 'స్వయంభు' సినిమాలో సంయుక్త మీనన్, నభానటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. షూటింగ్ ఎప్పుడో ప్రారంభించినప్పటికీ పలు కారణాల వల్ల ఇన్నాళ్లు విడుదల కాలేదు. భారీ అంచనాల మధ్య ఫిబ్రవరిలో రాబోతుందని నిఖిల్ అధికారికంగా ప్రకటించడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.


# తెలుగులో మరో బంపర్ ఆఫర్ అందుకున్న ప్రియాంక చోప్రా..



ప్రియాంక చోప్రా రెండు పాన్ ఇండియా ప్రాజెక్ట్స్‌లో ఉంటుందన్న వార్త బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్ ఇండస్ట్రీలో కూడా సంచలనం రేపుతోంది. అందులో ఒకటి.. రాజమౌళి లాంటి విజనరీ డైరెక్టర్ సినిమాలో హీరోయిన్‌గా నటించే అవకాశం దక్కించుకోవడం ఆమె కెరీర్‌కు మైలురాయిగా మారునుంది. మహేష్ బాబు ద-రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న ఈ ప్రాజెక్ట్ ఇండియన్ సినిమా చరిత్రనే మళ్లీ రాసేలా తెరకెక్కనుందన్న బజ్ ఉంది. ఇందులో ప్రియాంక పాత్ర కూడా స్ట్రాంగ్‌గా, కథలో కీలక మలుపులను ఇవ్వగలిగే విధంగా ఉండబోతుందట. ఈ కారణంతోనే ఆమె కూడా అందుబాటులో ఉన్న అన్ని ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టి 'వారణాసి' షూట్‌కు ప్రాధాన్యత ఇస్తోందని ఇండస్ట్రీ టాక్. దీంతో పాటు తెలుగులో ప్రియాంక చోప్రా మరో బంపర్ అందుకుందట. అదే రెబల్ స్టార్ ప్రభాస్, నాగ్ అశ్విన్ కాంబోలో రాబోతున్న 'కల్కి-2'. ఇక ఈ మొదటి భాగంలో దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటించగా.. బ్లాక్ బస్టర్ హిట్ అయింది.

కానీ సీక్వెల్‌లో ఆమెను తొలగించిన నిర్మాతలు ప్రియాంకను సంప్రదించినట్లు తెలుస్తోంది. అందుకు ఆమె కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. త్వరలోనే అధికారిక ప్రకటన కూడా రాబోతున్నట్లు సమాచారం. అభిమానులకు డబుల్ ధమాకా ఇవ్వడం ఖాయమని టాక్. అదీ గాక ఈ సీక్వెల్‌లో కమల్ హాసన్ విలన్‌గా కనిపించబోతుండటంతో, ప్రాజెక్ట్‌పై నెలకొన్న హైప్ రెట్టింపు అయింది. ఆయన %-% ప్రభాస్ స్క్రీన్‌పైని క్లాష్, అలాగే ప్రియాంక ప్రవేశం.. మొత్తం మీదే ఈ సినిమా పాన్ ఇండియా మాత్రమే కాదు, గ్లోబల్ మార్కెట్‌కూ వెళ్తుందన్న సంకేతాలు ఇస్తున్నాయి. నాగ్ అశ్విన్ ప్రత్యేకమైన కథలంటే ఇష్టపడే దర్శకుడు కాబట్టి, 'కల్కి-2'ను మరింత భారీ కాన్వాస్‌పై విజువల్ వండర్‌గా నిలబెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లుగా సమాచారం.

# అఖండ 2 టికెట్ల ధరలు పెంపు
## సీపీఐ నారాయణ హాట్ కామెంట్స్



టాలీవుడ్ అగ్ర హీరో నందమూరి బాలయ్య తాజాగా నటించిన సినిమా అఖండ 2. ఈ సినిమా డిసెంబర్ 5వ తేదీన రిలీజ్ కానున్న నేపథ్యంలో ఏపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ల ధరలను పెంచేందుకు పర్మిషన్స్ ఇచ్చింది చంద్రబాబు నాయుడు ప్రభుత్వం. అయితే ఈ సినిమా టికెట్ల ధరలు పెంచడంపై సీపీఐ నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అఖండ 2 సినిమా టికెట్ల ధరలు పెంచడానికి తీవ్రంగా ఖండించారు. వందల కోట్లు ఖర్చుపెట్టి సినిమాలు తీస్తున్న పేరుతో, టికెట్ల ధరలను పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని నిప్పులు చెరిగారు.

ఇలా టికెట్ల ధరలు క్రమక్రమంగా పెంచుకుంటూ పోతే, ఐ బొమ్మ రవి లాంటి పైరసీ చేసే వ్యక్తులు పుట్టగొడుగుల్లాగా పుట్టుకు వస్తారని గుర్తు చేశారు. టికెట్ల ధరలు పెంచి ప్రజలను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. సామాన్య ప్రజలు సినిమాలు చూడలేని పరిస్థితి, దీనివల్ల ఏర్పడుతోందని పేర్కొన్నారు. దీంతో జనాలు కూడా పైరసీకి అలవాటైపోతున్నారని, పైరసీ వెబ్ సైట్లు ఓపెన్ చేసి సినిమా చూస్తున్నారని తెలిపారు.

ఇకనైనా సినిమా టికెట్ల ధరల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. లేకపోతే, ఐ-బొమ్మ రవి లాంటి వాళ్లను అరెస్టు చేసే నైతిక హక్కు కూడా ప్రభుత్వం కోల్పోతుందని చురకలు అంటించారు సీపీఐ నారాయణ. కాగా, డిసెంబర్ 4వ తేదీన రాత్రి 10 గంటల అఖండ 2 ప్రీమియర్ షోకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ టికెట్ ధరను 600 రూపాయలుగా నిర్ణయించారు. విడుదలైన రోజు నుంచి పది రోజుల పాటు స్క్రీన్ థియేటర్లలో 75 రూపాయలు, మల్టీప్లెక్స్ లో 100 రూపాయలు పెంచుకునేలా జీవో జారీ చేసింది కూటమి సర్కార్.

Printed, Published and owned by --------------------, Printed at --------------------, H.No. 00000000, #####, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com